**DD9 వార్త**
తెలుగు దినపత్రిక
www.dd9vaartha.com
సంపుటి : 01 సంచిక : 94 గురువారం, నవంబర్ 20, 2025, పేజీలు - 10 వెల : 3/-

**మంచిమాట**
నీ తప్పును ఈరోజు కప్పిపుచ్చుకున్నంత మాత్రాన, రేపటి దాని పర్యవసానాన్ని తప్పించుకోలేవు.

## వచ్చే రెండ్రోజులు మరింత
# చలిగాలులు

**హైదరాబాద్, నవంబర్ 19:** రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో వచ్చే రెండు రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని వాతావరణశాఖ మంగళ వారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలా బాద్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొ న్నది. ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, కామా రెడ్డి, ఆసిఫాబాద్, కుమ్రంభీం, నిర్మల్ జిల్లాల తోపాటు మరో ఐదు జిల్లాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉన్నదని తెలిపి ంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-యూలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా రుద్రంగిలో 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యా యని, చలిగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రజలు వైద్యులు హెచ్చరించారు.



## బాబా బోధనలు మార్గదర్శనం చేశాయి

**శతజయంతి ఉత్సవాల్లో క్రికెటర్ టెండూల్కర్**

**పుట్టపర్తి, 19 :** సత్యసాయి బాబా బోధనలు నాలో ఎంతో ప్రేరణను ఇచ్చాయని.. ఐదేళ్ల వయస్సులో ఉన్నప్పుడు తన వెంట్రుకలు సత్యసాయిలా ఉన్నాయనే వారని మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తెలిపారు.. తమ మదిలో ఎన్నో ప్రశ్నలకు మిగతా2లో...

# అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు

- ఆయన భౌతికంగా లేకున్నా మనతోనే ఉన్నారు
- ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచాయి
- సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో ప్రధాని మోడీ




**పుట్టపర్తి,నవంబర్19:** సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని ప్రధాని మోదీ అన్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. భౌతికంగా బాబా లేకున్నా... ఆయన ప్రేమ మనతోనే ఉంది. సత్యసాయి బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తో ంది. కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు'.. ఇదే ఆయన నినాదం. చాలా మంది జీవితాలను సత్యసాయి సమూలంగా మార్చేశారు. లక్షల మందిని సేవామార్గంలో నడిపించారు. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. మిగతా2లో...

## ఎందరినో ప్రభావిత చేసిన సత్యసాయిబాబా

**ఆధ్యాత్మిక వెలుగునిచ్చిన అరుదైన శక్తి బాబా**
**శతజయంతి ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**




# పాలనలో ఇందిరాగాంధీ ఓ రోల్‌మోడల్

- ఆమె స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం
- ఇందిరకు ఘనంగా నివాళి అర్పించిన సిఎం
- జయంతి వేడుకల సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ






**హైదరాబాద్,నవంబర్19:** పరిపాలనలో ఇందిరా గాంధీ ఒక రోల్ మోడల్ అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బలహీన వర్గాలకు ఇందిరమ్మ పాలన సువర్ణ అధ్యాయమని సీఎం రేవంత్ చెప్పారు. భూ సంస్కరణలతో పేదలకు భూ పంపిణీ చేశారని గుర్తుచేశారు. పాకిస్తాన్‌ను విడగొట్టి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని, ప్రపంచ దేశాల బెదిరింపులకు ఇందిరమ్మ భయపడలేదని సీఎం రేవంత్ తెలిపారు. మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా.. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నామని, మహిళలకు మిగతా2లో...

## శతజయంతికి ఆహ్వానం అదృష్టం

- బాబా సేవలు చిరస్మరణీయం: ఐశ్వర్యా రాయ్


2లో

## మహిళల హక్కుల బలోపేతానికి కృషి

**రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి సీతక్క**




**హైదరాబాద్,నవంబర్19:** రాష్ట్రంలో మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, హక్కుల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిశలా శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ అన్నారు. మహిళల సమస్యలు అనే అంశంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నేడు బేగంపేటలోని ప్రజా భవన్లో నిర్వహించిన మిగతా2లో...

## లొంగుబాటుకు ఎన్నో అవకాశాలు ఇచ్చాం: బండి



**కరీంనగర్,నవంబర్19:** నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే.. అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు తీవ్రంగా వ్యాఖ్యానించారు. అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వాళ్ల చావులకు కారకులయ్యారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. నక్సల్స్ లొంగి పోవాలని పదేపదే కేంద్రం హెచ్చరిస్తూ మిగతా2లో...



## నేడు బీహార్ సిఎంగా మరోమారు నితీశ్ ప్రమాణం

- పదోసారి ప్రమాణం చేయబోతున్న నితీశ్
- ఎన్‌డిఎ నేతగా ఏకగ్రీవంగా ఎంపిక..గవర్నర్‌కు రాజీనామా
- నేటి ప్రమాణోత్సవానికి మోడీ, అమిత్ షా తదితరుల హాజరు

**పాట్నా,నవంబర్19 :** బిహార్‌లో నితీశ్ కుమార్ సారథ్యంలో ఎన్డీయే కొత్త ప్రభుత్వం గురువారం కొలువు తీరనుంది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగియనుండటంతో ముఖ్యమంత్రి పదవికి మిగతా2లో...

## ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

- ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి



**హైదరాబాద్,నవంబర్19:** పైరసీ సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్టైన తరవాత పోలీసులు కస్టడీ కోరారు. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు రవి కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల మిగతా2లో...

## పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన మోడీ

**చెన్నై,నవంబర్19 :** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం కింద 21వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. మిగతా2లో...



# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

- ఎలా గెలిచారో రేవంత్‌కు తెలియదా
- బీఆర్ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- జూబ్లీహిల్స్ నాయకులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్




**హైదరాబాద్,నవంబర్19:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచిందో రేవంత్‌రెడ్డి అంతరాత్మకు తెలుసునని బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరా మారావు అన్నారు. కర్నాటక నుంచి మనుషులను తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయించారన్నారు. షేక్‌పేట, ఎర్రగడ్డలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. రాయించి, వేయించు కున్న ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలిచారన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని మిగతా2లో...

## సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

- అదుపులోకి తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్,నవంబర్19:** నాంపల్లి లోని సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ జాగృతి, హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో.. కవితతో పాటు హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు తిప్పారపు సారయ్య సహా పలువురు నాయకులను నాంపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

## నేడు బిహార్ సిఎంగా మరోమారు నితీశ్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

నితీశ్ కుమార్ బుధవారం సాయంత్రం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను సమర్పించారు. ఎన్డీయే సభ్యుల మద్దతు లేఖను గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఇందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. నితీశ్ రాజీనామాను వెంటనే ఆమోదించారు. నితీశ్ వెంట గవర్నర్‌ను కలిసి వారిలో ఎల్‌జేపీఆర్‌వీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్, ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ తదితరులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా బుధవారం ఉదయం నుంచి పాట్నాలో వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. జేడీయూ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ లెసిస్లేచర్ పార్టీ నేతలు సైతం సమావేశమై పార్టీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా తిరిగి కొనసాగించాలని నిర్ణయించారు. అనంతరం ఎన్డీయే సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దిలీప్ జైశ్వాల్, సామ్రాట్ చౌదరి, చిరాగ్ పాశ్వాన్, కేశవ్ ప్రసాద్ మౌర్య, విజయ్ కుమార్ సిన్హా, రాజు తివారి సహా ఎన్డీయేకు చెందిన 202 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎన్డీయే లెజిస్లేచర్ పార్టీ నేతగా నితీశ్ కుమార్ పేరును సామ్రాట్ చౌదరి ప్రతిపాదించగా, ఎమ్మెల్యేలంతా బలపరిచారు. దీంతో నితీశ్ 10వ సారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ సమావేశానంతరం నితీశ్ సారథ్యంలోని పలువురు నేతలు గవర్నర్‌ను కలుసుకున్నారు. మరోవైపు, నితీశ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాట్నాలోని గాంధీ మైదానంలో 20వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు. దీంతో బిహార్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. తదుపరి ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ ఖరారయ్యారు. ఈ మేరకు ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.. తమ కూటమి నేతగా నీతీశ్‌ను ఎన్నుకున్నారు. జేడీయూ సుప్రీం నితీశ్ కుమార్ ఎన్డీయే (ఔఆం) నేతగా బుధవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన బిహార్ ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారానికి మార్గం సుగమమైంది. కొత్త మంత్రివర్గంలో బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా తిరిగి ఉప ముఖ్యమంత్రులుగా కొనసాగనున్నారు. ఈ మేరకు బీజేపీ ఎల్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే 243 స్థానాల్లో 202 స్థానాలు గెలుచుకుని అఖండ విజయం సొంతం చేసుకుంది. ఎన్డీయే ప్రధాన భాగస్వామ్య పార్టీ అయిన బీజేపీ 89 సీట్లు గెలుచుకుని బిహార్‌లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో 85 సీట్లతో ఆర్జేడీ నిలిచింది. ఎన్డీయే కూటమిలోని ఎల్‌జేపీఆర్‌వీ 19 సీట్లు, హెచ్‌ఏఎం 5, ఆర్‌ఎల్‌ఎం 4 సీట్లు గెలుచుకున్నాయి.

## పాలనలో ఇందిరాగాంధీ ఓ రోల్‌మోడల్

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లను చేశామని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ పాలన దేశానికి దిక్సూచి అని సీఎం రేవంత్ కొనియాడారు. వైఎస్‌ఆర్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించారని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్‌ఎస్ మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 65 లక్షల చీరలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పంపిణీ చేస్తామని, డిసెంబర్ 9 వరకూ ఇంటింటికీ చీరల పంపిణీ కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్చి ఫస్ట్ నుంచి 8 వరకూ రెండో విడతలో చీరల పంపిణీ ఉంటుందని, రెండో విడతలో 35 లక్షల చీరలను పట్టణాల్లో పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం డిసెంబరు 9 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి.. వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని వివరించారు. ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోంది. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలని సీఎం అన్నారు.

## మహిళల హక్కుల బలోపేతానికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

ఒక రోజు రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. పలువురు మహిళా ఐఏఎస్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతను రూపుమాపే విధంగా నిపుణులు, మేధావులు, అధికారుల సలహాలు తీసుకుంటామని అన్నారు. మహిళల సంక్షేమం, భద్రత విషయంలో ఎన్నో చట్టాలు ఉన్నా.. సమాజ పోకడల వల్ల కొన్నిసార్లు ఆచరణకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులు తెలుసుకోలేని పరిస్థితి కొన్నిసార్లు ఎదురవుతోందని అంటూ, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళలకు విద్యా, ఉపాధి ఉద్యోగ, భద్రత విషయాల్లో ఎలాంటి ఫెసిలిటీస్ ఇవ్వాలి అన్న అంశాలపై చర్చించి నివేదిక రూపొందించాలని సూచించారు. మహిళా విధానము ఎలా ఉంటే బాగుంటుంది అనే అంశంపై రౌండ్ టేబుల్ కన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకొని, ఇక్కడ వచ్చే సలహాలు, సూచన ప్రాతిపదికగా మరోసారి త్వరలో భారీ సదస్సును నిర్వహిస్తామని సీతక్క వెల్లడించారు. పిల్లలు, మహిళలు ఉపాధి విద్య అంశాల్లో ప్రభుత్వం ఇంకా ఏమి చేయాల్సి ఉందో తెలుసుకుంటామని చెప్పారు. ఎన్నో ఆటంకాలను చేదించి దేశ ప్రధానిగా ఈ దేశ అభివృద్ధి లో ముద్ర వేసిన ఇందిరా గాంధీ జయంతి మహిళలు ఆత్మగౌరవంతో ఎదగాలనీ ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల ఆర్థిక సాధికారత కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు చట్టాలు, విధానాలు తీసుకొచ్చుకునే విధంగా.. మీరిచ్చే సూచనలు సలహాలు ఉపయోగ పడుతుందని, ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఒక చర్చ మాత్రమే కాదు..భవిష్యత్తు మహిళా విధానానికి పునాది వేసే చారిత్రక ఘట్టమని స్పష్టం చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు శైలజా రామయ్యర్, అనిత రామచంద్రన్, దివ్య , దాసరి హరిచందన లతో పాటు వివిధ రంగా ల్లో ప్రముఖ మహిళా ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

నిలిచిందన్నారు. సునీతాగోపీనాథ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పని చేశారన్నారు. వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు.విషాదంలో ఉన్న హరీశ్‌రావు అంకితభావంతో పని చేశారని, స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరి కృషి చేద్దామన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉన్నా పూర్తి అండగా ఉంటామన్నారు. ఎవరికి సమస్య వచ్చినా తెలంగాణ భవన్‌కు రావొచ్చునన్నారు. డిసెంబర్‌లోగా సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, స్థానిక ఎన్నికలు పూర్తి కాగానే బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. బూత్‌లవారీగా పటిష్టంగా పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో 407 బూతుల్లో ఒక్కో బూత్‌కు 10 మంది చొప్పున పార్టీని పటిష్టం చేసుకోవాలన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని.. ప్రజా సమస్యలపై పోరాటం ఇప్పటి నుంచే మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేయాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్‌లో సాంకేతికంగా మాత్రమే కాంగ్రెస్ గెలుపని.. జూబ్లీహిల్స్‌లో నైతిక గెలుపు సునీత, బీఆర్‌ఎస్ పార్టీదేనన్నారు. బీఆర్‌ఎస్ నేతలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 18వేల ఓట్లు మాత్రమే వచ్చాయని.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 75వేల ఓట్లు సంపాదించామని తెలిపారు. మైనారిటీల మద్దతు కోల్పోతున్నామని కాంగ్రెస్ గుర్తించిందని.. బీఆర్‌ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని, బీఆర్‌ఎస్‌ను చూసి కాంగ్రెస్ పార్టీ గడగడలాడిపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, మజ్లిస్ ఒక వైపు, బీఆర్‌ఎస్ పార్టీ ఒంటరి పోరాటం చేసిందన్న హరీశ్.. అధికార దుర్వినియోగంతో గెలిచిన విషయం రేవంత్‌రెడ్డికి తెలుసునన్నారు.

## లొంగుబాటుకు ఎన్నో అవకాశాలు ఇచ్చాం: బండి

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిందన్నారు. వారు జనజీవన స్రవంతిలో కలిస్తే మంచి భవిష్యత్ ఉండేదన్నారు. కానీ కొందరు పెడచెవిన పెట్టారని అన్నారు. నక్సలైట్లు చనిపోతే వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల గుండెకోత మీకేం తెలుసు? నక్సలైట్ల తుపాకీని సమర్థించిన వారు కూడా నేరస్థులేనని అన్నారు. కేంద్ర హోంమంత్రి మాటంటే మాటే. మార్చి లోపు మావోయిజాన్ని పూర్తిగా అంతమొందిస్తాంఅని బండి సంజయ్ అన్నారు. ఆ మేరకు నక్సలిజం అంతం అవుతుందన్నారు. వారికి ప్రజల మద్దతు లేదన్నారు.

## వచ్చే దసరా నాటికి ఉప్పల్ కారిడార్

### • మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,నవంబర్19 :** ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు 2026 దసరా నాటికి కచ్చితంగా పూర్తిచేస్తామని రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా ఆర్‌అండ్‌బీ, నిర్మాణ సంస్థను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి మంత్రి.. వెంటనే బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉప్పల్ – వరంగల్ మార్గంలో అధికారులు ఇప్పటికే బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉప్పల్ – వరంగల్ మార్గంలో ప్రయాణించే వారికి, మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. మొత్తం 5.5 కి.మీ గాను 1.5కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు.

## అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు

(మొదటి పేజీ తరువాయి)

పుట్టపర్తి పవిత్ర భూమిలో ఏదో మహత్తు ఉంది. సత్యసాయి సంస్థలన్నీ ఇలాగే ప్రేమను పంచుతూ వర్ధిల్లాలని మోదీ అన్నారు. అంతకు ముందు సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్,నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తికి రావడం ఎంతో సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందికి మార్గం చూపాయని కొనియాడారు.ప్రేమ, శాంతితో కూడిన వసుధైక కుటుంబ భావన సత్యసాయిదని తెలిపారు. విశ్వశాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని అన్నారు. మానవ జీవితంలో సేవ చాలా ముఖ్యమని సత్యసాయి చెప్పారని గుర్తుచేశారు. అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలి.. ఇదే బాబా నినాదమని వివరించారు. గుజరాత్ భూకంపం వచ్చినప్పుడు బాబా సేవాదళ్ సేవలం దించిందని గుర్తుచేశారు. పేదలకు ఎప్పుడు ఆపద వచ్చినా.. బాబా సేవాదళ్ ఆదుకుంటుందని ప్రశంసించారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు.

## బాబా బోధనలు మార్గదర్శనం చేశాయి

(మొదటి పేజీ తరువాయి)

బాబా దగ్గర సమాధానాలు దొరికాయన్నారు.. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో సచిన్ మాట్లాడారు. బాబా బోధనలు తనను మార్గదర్శనం చేశాయని.. బాబా ఆశీస్సులతో జీవితంలో ఎన్నో సాధించానని చెప్పుకొచ్చారు. ప్రజలను ఎప్పుడు జడ్జ్ చేయొద్దని వారిని అర్థం చేసుకోవాలని బాబా నాతో చెప్పారు. దీని వల్ల చాలా సమస్యలు తొలగిపోతాయన్నారని గుర్తు చేసుకున్నారు. 2011 వరల్డ్‌కప్ నాటి రోజులను సచిన్ గుర్తు చేసుకున్నారు. 2011 వరల్డ్‌కప్ ఆడుతున్నప్పుడు తాను ఎంతో భావోద్వేగంగా ఉండేవాడినన్నారు. ఈ మ్యాచ్ ఆడేటప్పుడు బెంగళూరులో ఉన్నామని.. ఆ సమయంలో సత్య సాయిబాబా తన ఫోన్ చేసినట్లు సచిన్ గుర్తు చేసుకున్నారు. తను ఓ పుస్తకం సైతం పంపినట్లు చెప్పారు. ఆ పుస్తకం తనకు సానుకూల దృక్పథాన్ని, స్ఫూర్తిని ఇచ్చిందని.. ఆ ఏడాదిలో ట్రోఫీ కూడా గెలుచుకున్నామన్నారు. అది నాకు గో÷-డలెన్ మూమెంట్ అని సచిన్ చెప్పాడు.

## ఎందరినో ప్రభావిత చేసిన సత్యసాయిబాబా

### ఆధ్యాత్మిక వెలుగునిచ్చిన అరుదైన శక్తి బాబా

### శతజయంతి ఉత్సవాల్లో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**పుట్టపర్తి,నవంబర్19:** ఎంతో మందిని ప్రభావితం చేసిన వ్యక్తి శ్రీ సత్యసాయిబాబా అని ఆంధ్రప్రదేశ్ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు.. ప్రపంచానికి ఆధ్యాత్మికంగా వెలుగులిచ్చిన అరుదైన శక్తి శ్రీ సత్యసాయి బాబా అని పవన్ కళ్యాణ్ అన్నారు. పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఆయన ప్రసంగించారు. అనంతపురం లాంటి వెనుకబడిన ప్రాంతంలో సత్యసాయి జన్మించడం ఎంతో ప్రత్యేకమైన విషయం అన్నారు పవన్ కల్యాణ్.. విదేశాల్లో కూడా సత్యసాయి ప్రభావం అపారంగా ఉంది. ఎన్నో దేశాల్లో అనేక మంది భక్తులను చూసాను. ఆయన చూపిన మానవతా మార్గం ప్రపంచ వ్యాప్తంగా మార్పును తీసుకువచ్చింది అని అన్నారు. సత్యసాయి బాబా ప్రజల ప్రాథమిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని సామాన్యుడికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో పని చేశారని పేర్కొన్నారు పవన్ కల్యాణ్.. జల్ జీవన్ మిషన్‌కు ముందుగానే ఆయనే ఆలోచించారు. నీటి కోసం ఎన్నో ఎడారులు తిరిగిన ప్రజలకు ఆశగా నిలిచారు. అలాంటి సేవా తత్పరత అరుదైనది అని పవన్ పేర్కొన్నారు.సచిన్ టెండూల్కర్, ఐఏఎస్‌లు, శాస్త్రవేత్తలు, ప్రపంచ నాయకులు సహా వేలాది మంది సత్యసాయి సేవా సిద్దాంతం, ఆధ్యాత్మికత, మానవతా మార్గం ప్రభావంతో మారిపోయారని పవన్ చెప్పారు.సత్యసాయి బోధనలు కాలాతీతం. ప్రేమ, సేవ, దయ?ఇవి ఆయన సందేశం అని గుర్తు చేశారు పవన్ కల్యాణ్? ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తాం అని ప్రకటించారు.. ఇది కేవలం వేడుక కాదు.. ఒక మహానీయుని భావజాలాన్ని తరువాతి తరాలకు అందించే సంకల్పం‘ అని పవన్ కళ్యాణ్ అన్నారు. మన కంటే ఎక్కువగా శ్రీ సత్యసాయి బాబా గురించి విదేశాలకు తెలుసు అని చెప్పారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

## శతజయంతికి ఆహ్వానం అదృష్టం

**పుట్టపర్తి,నవంబర్19:** సత్యసాయి శతజయంతికి తనను ఆహ్వానించడం గౌరవంగా భావిస్తున్నానని నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ పేర్కొన్నారు.. సత్యసాయి బోధనలు ప్రపంచానికి మార్గదర్శనం చేశాయన్నారు.. సత్యసాయి ట్రస్ట్ ఎన్నో విద్యా సంస్థలు పెట్టి పేదలకు ఉచిత విద్య అందిస్తోందని కొనియాడారు. తాజాగా సత్యసాయి శతజయంతి ఉత్సవ కార్యక్రమంలో ఐశ్వర్యరాయ్ ప్రసంగించారు. ప్రజలకు సత్యసాయి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఎప్పుడూ ఒక మాట చెప్పేవారు. ‘నిజమైన నాయకత్వం అంటే భగవంతుడికి, ప్రజలకు సేవ చేయడం‘ అని వివరించేవారని గుర్తు చేసుకున్నారు. సత్యసాయి ఛారిటీ చేస్తున్న సేవలను కొనియాడుతూ.. ఈ ఛారిటీ ద్వారా వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా విద్య అందుతోందని తెలిపారు. సత్యసాయి ట్రాస్ట్ ద్వారా నెలకొన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వందలాది మంది పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు.

## పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా నిధులు జమకానున్నాయి.పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైంది. పీఎం కిసాన్ పథకం కింద దేశవ్యాప్తంగా కోట్లాది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. ఇప్పటి వరకు 20 విడతల్లో రూ.3.70 లక్షల కోట్లకు పైగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. భూమి వివరాలు ఖఓ–ఐఎ÷ూంఔ పోర్టల్‌లో నమోదై ఉండి, బ్యాంకు ఖాతా ఆధార్‌తో లింక్ అయి ఉన్న రైతులకు పథకం ప్రయోజనాలు అందుతున్నాయి.

## ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

(మొదటి పేజీ తరువాయి)

కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి ఐబొమ్మ రవిని కస్టడీలోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించనున్నారు. పైరసీ మాఫియాకు సంబంధించిన వివరాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు.వారం రోజుల పాటు ఇమంది రవిని కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించారు.

# నిలిపివేసిన పీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలి : టీయూసీఐ డిమాండ్



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** ఈపీఎఫ్ పెన్షన్‌ను పెంచుతామని హామీ ఇచ్చి, ఆ హామీని నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తోందని పెంచిన పెన్షన్‌ను తక్షణమే కార్మికులకు అందించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేష్ డిమాండ్ చేసారు. ఎడపల్లి మండల కేంద్రంలో బుధవారం బీడీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వ ఈపీఎఫ్ఓ విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పీఎఫ్ డబ్బుల చెల్లింపు విషయంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపారు. పీఎఫ్ రికార్డుల్లో ఉన్న సర్ నేమ్, పేరు, వయస్సు వంటి వివరాలు ఆధార్ కార్డులోని వివరాలతో సరిపోలడం లేదనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి, కార్మికులకు చెల్లించాల్సిన సుమారు ?33 లక్షల కోట్ల పీఎఫ్ డబ్బులను నిలిపివేయడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు. ఆధార్ కార్డులు జారీ కాకముందు కార్మికులు పనిచేసిన కంపెనీల యజమానులు రికార్డులలో పేర్లను, మారు పేర్లను, వయస్సులను ఒకరకంగా నమోదు చేయడం, ఆ తర్వాత ఆధార్ కార్డులలో మరోరకంగా నమోదు కావడం వల్లే ఈ వ్యత్యాసం ఏర్పడిందని, దీనికి కార్మికులు బాధ్యులు కాదని, కష్టపడి దాచుకున్న ఆ డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసమనే పేరుతో పీఎఫ్ డబ్బుల నుండి ఏకంగా 20% నిధులను షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెడుతున్న కేంద్రం, మరోవైపు గతంలో ఉన్న సంక్షేమ పథకాలను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో కె.రాజు, సి.హెచ్ అనిత,ఎస్. లక్ష్మి, నాగమణి, విజయ, రాజమణి, మమత, వసీమా, షబానా, రేష్మ, మైముదా,రజియా, పర్వాన, సల్మా, షాహిన్ బేగం పాల్గొన్నారు.

# ఎడపల్లి మండల కేంద్రంలో ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలు



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** ఎడపల్లి మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ సేవా దళ్, బోధన్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్లు ఐరండ్ల నవీన్, మల్లెపూల గంగా శేఖర్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ డల్లా సురేశ్ మహాజన్ మాట్లాడుతూ.. 1917 నవంబర్ 19న అలహాబాద్‌లో జన్మించిన ఇందిరా గాంధీ, దేశ తొలి మహిళా ప్రధానిగా మొక్కవోని దీక్షతో దేశాభివృద్ధికి కృషి చేశారని, బ్యాంకులను జాతీయం చేయడం, భూసంస్కరణలు చేపట్టడం లాంటి విప్లవాత్మక నిర్ణయాలతో పేదరికాన్ని అరికట్టారని, అందుకే ఇప్పటికీ బడుగు బలహీన వర్గాలు ఆమెను 'ఇందిరమ్మ' అని గౌరవంగా పిలుచుకుంటారని గుర్తు చేశారు. దేశ రక్షణ విషయంలో ఆమె ఎలాంటి రాజీ పడకుండా పాకిస్తాన్‌ను ఓడించి విజయం సాధించారని, ప్రతిపక్షాలను సైతం కలుపుకొని దేశ ఐక్యతను చాటిన గొప్ప నేత అని, ఆమె ధైర్యసాహసాలకు ప్రపంచం 'ఐరన్ లేడీ' అని, ప్రతిపక్ష నేత వాజ్‌పేయి సైతం 'భారత దుర్గాదేవి' అని సంబోధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ శంకర్ బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బజార్ హత్నూర్ మండల బాలల పరిరక్షణ సమితి ఏర్పాటు







**బజార్ హత్నూర్, నవంబర్ 19(%ణణ%9వార్త)ః** బజార్హత్నూర్ మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో బాలల సంరక్షణ సహాయ కేంద్రం సమన్వయకర్తసతీష్,డిహెచ్ఈడబ్ల్యూ ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ రెడ్డిల అధ్వర్యంలో బుధవారం రోజు మండల తహసిల్దార్ అధ్యక్ష తన సమావేశం ఏర్పాటు చేసి, మండల బాలల పరిరక్షణ సమిత ఏర్పాటు చేశారు. అనంతరం అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.పిల్లల సహాయ కేంద్రం సమన్వయ కర్త సతీష్ మాట్లాడుతూ ఈ కమిటీలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కన్వీనర్ గా, తహసిల్దార్ సెక్రటరీగా ఉంటూ, ఎంఈఓ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఏపీఓ,ఏపీఎం మండల సమై క్య అధ్యక్షులు,కిషోర్ బాలికలు, గ్రామ పెద్దలు, యువకులు,పాత్రికేయులు, సభ్యులుగా ఉంటారని చెప్పారు.ఇతర సభ్యులు మాట్లాడుతూ.. బాలల హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని బాలల హక్కులకు ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే 1098 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.ఈ నెంబర్ కి కాల్ చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయనిఅన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు అభివృద్ధి చెందితేనే ,సమాజం,దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమన్న, వైద్య శాఖ అధికారి ప్రేమ్ కుమార్, అంగన్వాడీ టీచర్స్, పంచాయతీ కార్యదర్శి లు పాల్గొన్నారు..

# 'మేముసైతం' ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** విద్యార్థులకు అండగా నిలిచే లక్ష్యంతో డా.నవీన్ కుమార్ నేతృత్వంలోని మేముసైతం స్వచ్ఛంద సేవా సంస్థ, ప్రతిభ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఏరాజ్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ పార్ట్నర్ శ్రీ విజయభాస్కర్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన పరీక్షా అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేముసైతం సంస్థ సభ్యుడు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని, భవిష్యత్తులో సమాజం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఉపాధ్యాయులు ఉదయలక్ష్మి, శ్రీలక్ష్మి, కాట్రగడ్డ భారతి, సునీత, యామిని, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళల ఉన్నతి- తెలంగాణ ప్రగతి కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణ

- **ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం.**
- **ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయం**
- **ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారి**
- **జిల్లాలో నవంబర్ 19 నుంచి డిసెంబర్ 9 వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ**
- **వివాదాలకు తావు లేకుండా ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి**
- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**









**కామారెడ్డి,నవంబర్ 19(డిడి9 వార్త):** బుధవారం సంబంధిత అధికారులతో మినీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో నిర్వహించి దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శ్రీకారం చుట్టిన చీరల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, మండలాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు.ఈ రోజు నవంబర్ 19 నుండి డిసెంబర్ 09 వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించాలని, జిల్లాలో ఎంతమంది మహిళలకు చీరల పంపిణీ చేశారన్న వివరాలు సమగ్రంగా డేటా సేకరణ చేపట్టాలని తెలిపారు.పండుగ వాతావరణం లో ఘనంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. నియోజక వర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని,18 ఏళ్లు పైబడిన మహిళలు చీరలకు అర్హులని, పౌర సరఫరాల డేటా ప్రకారం 311922 మంది మహిళలు చీరలు పొందడానికి అర్హులని తెలిపారు.అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటి సీఎం బట్టి విక్రమార్క, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలతో కలసి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇందిరా మహిళా శక్తి సంఘాల తో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీని ఈ రోజు ప్రారంభించుకున్నాం అని, ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయం , ఇందులో భాగంగా ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విడతల వారీగా ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు .ఒక పండగ వాతావరణం లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, మహిళల ఉన్నతి– తెలంగాణ ప్రగతి కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు.మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడమే కాదు,వాటికి మహిళలను యజమానులను చేశామని,స్కూల్స్ లో యూనిఫారం కుట్టే కుట్టుపని బాధ్యత మహిళా సంఘాలకే అప్పగించాం, ఇందిరమ్మ క్యాంటీన్లు, శిల్పారామంలో 3 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశాం ,ఆన్ లైన్ మార్కెట్ కోసం అమెజాన్ తో సంప్రదింపులు చేస్తున్నాం అని తెలిపారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు.పూర్తి వివరాలతో ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని గ్రామీణ ప్రాంతాల్లో ఇవాల్టి నుంచి డిసెంబర్ 9 వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందని మార్చి 1 నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందన్నారు.కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సందర్భం లో వివాదాలకు తావు లేకుండా ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, డిఆర్డివోసురేందర్, ఇందిరా మహిళా శక్తిసంఘాల, పాల్గొన్నారు.

# బోధన్ లో టీవీపీ ధర్నా : తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్




**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలే నాగేష్ ప్రభుత్వాన్ని కోరారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వలన అనేక మంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. దొంగ హామీలతో ప్రజలను, నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో విద్యార్థుల శక్తిని చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిఖిల్, వీరేష్, పాల్గొన్నారు.

# బస్తీ దవాఖాన మరమ్మత్తుల పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** బోధన్ పట్టణంలో 32వ వార్డులో జరుగుతున్న బస్తీ దవాఖాన మరమ్మత్తుల పనులను బుధవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో బుధవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మరమ్మత్తు పనుల పురోగతిని తెలుసుకు న్నారు. దవాఖాన భవనంలోని అన్ని మరమ్మతు పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పట్టణ ప్రజలకు తాగునీరు అందించే వ్యవస్థపై దృష్టి సారించారు. రాకాసిపేటలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ను సందర్శించి, అక్కడ జరుగుతున్న ఫిల్టర్ మీడియా మార్పిడి పనులను దగ్గర ఉండి పర్యవేక్షించారు. పనులు నాణ్య తతో, జరిగేలా చూడాలని ఇంజనీర్లకు సూచించారు. ఆయన వెంట మునిసిపల్ డీఈ ఉన్నారు.

# పీఎం కిసాన్ 21వ విడత నిధుల విడుదల

**బాన్సువాడ,నవంబర్ 19(డిడి9 వార్త) :** దేశవ్యాప్తంగా రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 21వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం కోయంబత్తూరులో విడుదల చేశారు. ఈ విడత కింద రైతుల ఖాతాల్లో నేరుగా నగదు బదిలీ చేయబడింది. పథకం ప్రారంభం నుండి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సుమారు 3.70 లక్షల కోట్లు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.పీఎం కిసాన్ పథకం కింద అర్హత ఉన్న ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.6,000 చొప్పున మూడు విడతలుగా సహాయాన్ని అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రైతులు ఈ పథకం ద్వారా లాభం పొందనున్నారు.ఈ కార్యక్రమాన్ని బీర్కూర్ మండలకేంద్రంలోని




రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించగా, అనంతరం బీజేపీ బీర్కూర్ మండల అధ్యక్షుడు నాగెల్ల సాయికిరణ్ మాట్లాడుతూ, "రైతుల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ అనేక పథకాలు తీసుకువచ్చారు. అందులో పీఎం కిసాన్ అత్యంత కీలకమైనది.



ఈ పథకం రైతులకు ఎంతో మేలు చేస్తోంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఈవో రాజేష్, బైరాపూర్ సహకార సంఘ కార్యదర్శి భూమయ్య, బీజేపీ నాయకులు రాజు, నాగేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై అందుబాటులో వ్యవసాయ పనిముట్లు.

**బజార్ హత్నూర్, నవంబర్, 19(%ణణ%9వార్త):-** బజార్ హత్నూర్ మండలంలోవ్యవసాయ యాంత్రికరణ 2025-26 సంవత్సరానికి యాంత్రికరణలో భాగంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండలవ్యవసాయఅధికారితెలిపారు.ఆసక్తి గల రైతులుతమ సంబందించిన వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా వ్యవసాయ అధికారి సంప్రదించి వివరాలు పొందవచ్చు.చిన్న, సన్నకారు,మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50% సబ్సిడీ, మిగతా రైతులకు 40%సబ్సిడిపైలభిస్తాయనితెలిపారు.

## ధర్మారెడ్డి గ్రామ రైతులు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు



**కామారెడ్డి,నవంబర్న్19(డిడి9 వార్త) :** నూతన కొనుగోలు సీజన్ ప్రారంభమైన నెల వ్యవధిలోనే ధాన్యం సంపూర్ణంగా కొనుగోలు పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో పూర్తి మొత్తంగా చెల్లింపులు జమ చేసినందుకు ధర్మారెడ్డి గ్రామ రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఇందిరా క్రాంతి పథకం ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా ఈసారి ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగిందని రైతులు పేర్కొన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఒక్క గింజ కూడా నష్టపోకుండా సేకరించడం, సకాలంలో చెల్లింపులు జరగడం తమకు ఎంతో ఉపశమనంగా మారిందని వారు తెలియజేశారు.ధాన్యం కొనుగోలు కార్యక్రమం సమర్థవంతంగా ముగియడానికి ధర్మారెడ్డి గ్రామ రైతులు అందించిన సహకారాన్ని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించిన ఐకేపీ సీసీ ఇన్‌చార్జి కొమ్మ దత్తుతో పాటు కేంద్ర సిబ్బంది, మహిళా సమాఖ్య కమిటీ సభ్యులను కూడా కలెక్టర్ అభినందించారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఏపీఎం రామ్ నారాయణ గౌడ్, రైతులు నారాయణ, దేవయ్య, సాయిబాబా, యు. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి







**కామారెడ్డి,నవంబర్ 19(డిడి9 వార్త):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ రైల్వే కమాన్ సమీపంలో మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలుగా అంచనా వేస్తున్నారు. ఆయన వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదు. తెలుపు రంగు బనియన్, షర్ట్ ధరించి ఉండగా, ఒంటిపై జంజీరం ఉన్నట్లు పోలీసులు చెప్పారు.ఇది ప్రమాదమా, ఆత్మహత్యా అనేది స్పష్టంగా తెలియరాలేదని వారు తెలిపారు. మృతుడిని గుర్తుపట్టిన వారు కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## సహకార సంఘాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి





**బాన్సువాడ,నవంబర్ 19(డిడి9 వార్త):** మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బాన్సువాడ బుడిమి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భం గా ధాన్యం కొనుగోలు ప్రక్రియను, అలాగే రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యా బ్‌లలో నమోదు చేసే విధానాన్ని పరిశీలిం చారు.సహకార సంఘం అధికారులు, సిబ్బందిని ఉద్దేశి ంచి మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీలను వేగంగా పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో మద్దతు ధర నిధులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సబ్ కలెక్టర్ తో పాటు బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్,ఎన్‌ఫోర్స్‌మెంట్ ఖాజా, సొసైటీ అధ్యక్షులు ఏర్వల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి అంశాలలో పురోగతి సాధించాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** పంచాయతీ రాజ్ %డ% గ్రామీణాభివృద్ధి విభాగానికి సంబంధించిన అన్ని అంశాలలో నాణ్యమైన పురోగతిని సాధించేందుకు కార్యదర్శులందరూ సమన్వయంతో పనిచేయాలని సాలూర మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. సాలూర మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన మంజూరు ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని తెలిపారు. మంజూరు పూర్తయినప్పటికీ నిర్మాణం ప్రారంభం కాని ఇళ్ల పనులలో వేగవంతమైన పురోగతి కనిపించేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక పర్యవేక్షణ చేసి లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధిలో భాగమైన నర్సరీల సమర్థవంతమైన నిర్వహణ, వర్షాకాలంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించడం, వాటిని సంరక్షించడం అత్యవసరమని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటరు పట్టికల మళ్లీ ధ్రువీకరణ (పునఃపరిశీలన) కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆర్థిక వనరుల సమీకరణలో భాగంగా, గ్రామ పంచాయతీ పన్నుల వసూలు లక్ష్యాలను నిర్ణీత సమయంలో చేరుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు వంటి సేవలతో పురోగతిని సాధించేందుకు కార్యదర్శులందరూ సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల ను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.






**కామారెడ్డి,నవంబర్ 19(డిడి9 వార్త):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి పై సంబంధిత అధికారులు,మూడు మండలాల ఎంపిడిఓ లతో కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మూడు మండలాలైన మద్నూర్, ఎల్లారెడ్డి, భిక్నూర్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి పై ఆరా తీశారు.ఈ సందర్భంగా మండలాల వారిగా ప్రోగ్రెస్ ను అడిగి తెలుసుకొని వంద శాతం ఇంటి నిర్మాణ పనులను ప్రత్యేక చొరవ తీసుకుని వివిధ దశలో ఉన్న వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.మద్నూర్ మండలం లో మొత్తం 626 మంజూరై మర్క్‌అవుట్ కాగా అందులో 426 ఇళ్లు ప్రోగ్రెస్ లో ఉన్నాయని,ఎల్లారెడ్డి మండలం లో 337 కి 325 అప్రూవల్ కాగా 225 నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నాయని,భిక్నూర్ మండలం లో 669 లో 656 అప్రూవల్ లో 495 మార్క్‌అవుట్ వివిధ దశలో ఉన్నాయని తెలిపారు.పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా నిర్మాణ పనులు చేపట్టాలని నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.ఈ సందర్భంగా ఇంకా ఆయా మండలాలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజల గృహావసర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం సామాజిక, ఆర్థికంగా పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు.అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, పథకానికి సంబంధించిన సమాచారం గ్రామ, వార్డు స్థాయిలో లబ్ధిదారులు అవసరమైన పత్రాలు సమర్పించి, సమయానికి దరఖాస్తులు పూర్తి చేసుకొనేల అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.పథకం అమలు ప్రక్రియ వేగవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ నిర్మాణం చేపట్టే ప్రతి అర్హత కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న సహాయం, సబ్సిడీలు, సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మదన్ మోహన్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ,సీఈఓచందర్, డిఎల్పివో ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆశావహులకు తీపికబురు స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ కీలక ప్రకటన

**బజార్ హత్నూర్, నవంబర్ 19(%ణణ%9వార్త):-** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం (స్టేట్ ఎలక్షన్ కమిషన్) వేగంగా కసరత్తు చేపట్టింది.ఈ క్రమంలో పంచాయతీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను మరోసారి సవరించేందుకు షెడ్యూల్‌ను ఎస్ఈసీ ఇవాళ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో రేపటి నుంచి నవంబర్ 23 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనుంది. ఈ నాలుగు రోజుల్లో గ్రామాల్లో ఓటర్ల జాబితాలను ఇంటింటి స్థాయిలో పరిశీలించి, కొత్తగా అర్హత సాధించినవారి పేర్లు చేర్చడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, ఇతర సవరణలు చేపట్టనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో బూత్ లెవెల్ ఆఫీసర్లు , గ్రామ రెవెన్యూ అధికారులు, స్థానిక సర్పంచ్‌ల సహకారంతో ఈ ప్రక్రియ జరుగనుందికాగా, ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకోవడానికి, అవసరమైన సవరణలు చేయించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈసీ సూచించింది. ఇప్పటికే జులై 1, 2025 నాటి అర్హతతో రూరల్ ఓటర్ల జాబితా తుది రూపం పొందగా, ఈ చివరి సవరణ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, డిసెంబర్ చివరి వారంలో లేదా 2026 జనవరి మొదటి వారంలో పోలింగ్ జరగవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ఓటర్లు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, రాబోయే నాలుగు రోజుల్లో తప్పనిసరిగా జాబితా పరిశీలించుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది.





## నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో కఠినంగా 'అరైవ్ అలైవ్' అమలు : సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్, నవంబర్ 19 (డీడీ9 వార్త) :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఉద్దేశించిన "అరైవ్ అలైవ్" మరియు "డిఫెన్సివ్ డ్రైవింగ్" కార్యక్రమాలు ఇకపై మరింత పటిష్టంగా అమలు చేయబడతాయని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య బుధవారం ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాల ప్రభావం ప్రతి కుటుంబంపైనా ఉంటుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రచారం ద్వారా ప్రమాదాల తగ్గింపు, సురక్షితమైన డ్రైవింగ్ అలవాట్లు, డ్రంక్ అండ్ డ్రైవ్ నియంత్రణ, హెల్మెట్-సీటు బెల్టు వాడకం పెంపు వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓవర్ స్పీడ్ డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ వాడకంపై కఠిన వ్యవహరించడం, పౌరుల భద్రత కోసం ఉద్దేశించిన ఈ కార్యక్రమాలు అన్ని స్కూళ్లు, కళాశాలలు, కార్యాలయాలు, గ్రామాలు, ప్రధాన జంక్షన్లలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని వెల్లడించారు. ప్రజలు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



## నిలువలు ఎక్కువ ఉన్నవి -మొక్క జొన్నలు, సోయలు ఇచ్చోడ మార్కెట్ యార్డ్కి తేవద్దు.


తెలియజేయినది ఏమనగా
మార్కెట్ యార్డ్ లో సోయా, మరియు మొక్క జొన్న నిలువలు ఎక్కువగా ఉన్నందున..మార్కెట్ యార్డ్ రేపటి నుండి అనగా తేదీ: 20/11/2025 నుండి 22/11/2025 వరకు మూడు రోజులు బంధు ఉండును.
కావున రైతు సోదరులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ యార్డ్ కి పంట ను తీసుకు రావద్దని మనవి.

ఇట్లు
సెంటర్ ఇంచార్జీ
AMC ICHODA

**ఇచ్చోడ, నవంబర్, 19(%ణణ%9వార్త):** ఇచ్చోడ మార్కెట్ యార్డ్ లో ఇప్పటికే మొక్క జొన్న లు, సోయలు ఎక్కువగా నిలువ ఉన్నవి. అందుకని రైతు సోదరులు మీ పంటలు ఈ నెల 20,21,22,తేదీ లలో ఇచ్చోడలోని మార్కెట్ యార్డ్ తేవద్దని ఒక ప్రకటన ద్వారా ఇచ్చోడ మార్కెట్ యార్డ్ ఇంచార్జి తెలిపారు. నిలువలు అయిపోయిన పిదప తాము సమాచారం ఇస్తామని అప్పుడు అమ్ముకొనుటకు తేవచ్చని అన్నారు.

# "ఈ అవార్డు మనందరి కృషి ఫలితం" జిల్లా కలెక్టర్ రాజర్షి షా









**నవంబర్ 19, 2025 ఆదిలాబాద్ జిల్లా డిడి 9 వార్త:-** జల సంరక్షణలో ఆదర్శంగా నిలిచి రాష్ట్రపతి అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు శ్యామల దేవి, సోమ రాజేశ్వర్ పూలమొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు భారీగా చేరుకుని కలెక్టర్‌ను అభినందించారు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్ నుండి క్యాంప్ కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గుస్సాడి నృత్యాలు, బతుకమ్మ, బోనాల నృత్యాలు, మహిళల సందడి, అధికారులు, సిబ్బంది ఉత్సాహపూర్వకంగా పాల్గొనడం వలన ర్యాలీ సందడి వాతావరణాన్ని సృష్టించింది. కలెక్టర్ దంపతుల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ జాతీయ పురస్కారం వ్యక్తిగతంగా నాది కాదని, మనందరి కృషి, నిబద్ధతకి వచ్చిన గుర్తింపు అన్నారు. ఆదిలాబాద్ ప్రజల ప్రేమ, సత్కారం తనకు అపారమైన ఉత్సాహాన్ని ఇచ్చిందని చెప్పారు. అక్షరక్రమంలో ముందే ఉండే ఆదిలాబాద్, అభివృద్ధిలో కూడా ముందువరుసలో ఉండేలా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

జిల్లాలో అమలైన రైన్వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, చెరువుల పునరుద్ధరణ, లోతుదిద్దడం, వాటర్ స్మార్ట్ విలేజ్ కార్యక్రమాలు, గ్రామ జల్ కమిటీల భాగస్వామ్యం, పాఠశాల స్థాయిలో నీటి సంరక్షణ ప్రచారం వంటి విస్తృత చర్యల ఫలితంగానే ఈ జాతీయ గుర్తింపు లభించిందని వివరించారు. దక్షిణ జోన్‌లో మొదటి స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని, కేంద్రం ప్రకటించిన రూ. 2 కోట్లు జల సంరక్షణలో మరిన్ని వినూత్న కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అత్యంత గౌరవకరమైందని చెప్పారు. ఈ పురస్కారం మనందరికీ ప్రేరణ. ఆదిలాబాద్‌ను దేశవ్యాప్తంగా జల సంరక్షణకు ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం అని కలెక్టర్ హామీ ఇచ్చారు. ర్యాలీ అనంతరం క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, అధికారులు మరియు సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

# జీవితంపై విరక్తితో వృద్ధుని ఆత్మహత్య



**బాన్సువాడ,నవంబర్ 19(డిడి9 వార్త):** నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కొంతకాలంగా ఆస్తమాతో బాధపడుతున్న చిట్టి వీరయ్య (72) జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం కూతురు పెళ్లి కోసం ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు వీరయ్యను తీవ్ర నిరాశకు గురి చేశాయి. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.ంది

# సాలూరలోని ఫర్టిలైజర్ గోదాంలో అగ్ని ప్రమాదం



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** సాలూర మండల కేంద్రంలోని శ్రీ గంగా లక్ష్మీ ఫర్టిలైజర్ గోదాంలో బుధవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. గోదాంలో నిల్వ సామాగ్రి మొత్తం పూర్తిస్థాయిలో కాలి బూడిదైంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 నుంచి 25 లక్షల విలువైన సామాగ్రి నష్టం జరిగినట్లుగా గోదాం యజమాని లక్ష్మణ్ వెల్లడించారు. అగ్ని ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

**బోనకల్,నవంబర్ 19,(డీడీ9 వార్త):** బోనకల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖా ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ శాఖా అధ్యక్షులు తోటపల్లి స్వామి,మాజీ సర్పంచ్ సైదా నాయక్ ఇందిరమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు బీపీ నాయక్ ఇందిరమ్మ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బీపీ నాయక్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఇందిరా గాంధీ కేవలం 5 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ వస్తువులను బహిష్కరించే ఉద్యమంలో పాల్గొని, తనకు ఇష్టమైన ఇంగ్లండ్‌లో తయారైన బొమ్మను కాల్చేశారు! 12 ఏళ్లకే వానర సేన అనే పిల్లల సంస్థను స్థాపించి, స్వాతంత్ర్య సమాచారాన్ని రహస్యంగా పంపే వారని, గూంగీ గుడియా నుంచి ఉక్కు మహిళగా పేరు పొందారని,1971 యుద్ధంలో



90,000 మంది పాక్ సైనికులు లొంగిపోయేలా చేసి అప్పటి ప్రతిపక్ష నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి చేత దుర్గా దేవి లా కీర్తింపబడ్డరని బీపీ నాయక్ అన్నారు. 14 బ్యాంకులను జాతీయం చేశారని, పేదరిక నిర్మూలనకు కృషి చేశారని, హరిత విప్లవం కు నాంది పలికారని ఇలా అనేక పనులు చేసి ఈ దేశం కోసం ప్రాణ త్యాగము చేసిన మాతృమూర్తి అని, అలాంటి గొప్ప వారు చాలా అరుదు గా పుడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బానొత్ జ్వాల, ప్రధాన కార్యదర్శి గుగులోతు వేణు గోపాల్, భూక్యా భద్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, అంతోటి వెంకటేశ్వర్లు,యార్లగడ్డ కృష్ణయ్య, వజ్రాల రామాచారి, గోంగూర పద్మ, భూక్యా బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ జయంతి సందర్బంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళా శక్తి చీరలు పంపిణీ

**కామారెడ్డి,నవంబర్ 19(డిడి9 వార్త):** స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు "ఇందిరా మహిళా శక్తి చీరలు" పంపిణీ కార్య క్రమాన్ని ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతు ల మీదుగా కామారెడ్డి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప రాణి చీరలను స్వీకరించారు. ఈ కార్య క్రమం రాష్ట్రవ్యాప్తంగామహిళా సంక్షేమ కార్యక్రమాలను ప్రోత్సహించడానికి మార్గదర్శకంగా ఉంది.



# మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విప్లవాత్మక నిర్ణయాలతో దేశానికి మార్గదర్శనం



**నిజామాబాద్, నవంబర్ 19(డీడీ9 వార్త) :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్?లో బుధవారం ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నుడా ఛైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ తీసుకున్న చారిత్రక నిర్ణయాలైన బ్యాంకుల జాతీయం, హరిత విప్లవం, మరియు 'గరీబీ హటావో' నినాదంతో ప్రవేశపెట్టిన 20 సూత్రాల పథకం వంటి విప్లవాత్మక చర్యల వల్లే నేడు భారతదేశం ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా నిలబడగలిగిందని కొనియాడారు. ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్ సహా పలువురు జిల్లా, నగర స్థాయి కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ఆగిన ఇసుక లారీలు

- ప్రజల ఆగ్రహానికి దిగివచ్చిన యంత్రాంగం
- స్థానిక ఎస్సై హామీతో ధర్నా విరమించిన గ్రామస్తులు





**నవంబర్ 19 డిడి 9 వార్త వెంకటాపురం.** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి వచ్చే ఇసుక లారీలు వల్ల తమ రోడ్లు నాశనం అవుతున్నాయని, దుమ్ము వల్ల ఆరోగ్యాలు పాడవుతున్నాయని సోమవారం మండల కేంద్రంలో గల ఆలుబాక గ్రామంలో స్థానికులు .. ఇసుక లారీలను వెళ్లకుండా ఆపివేసిన విషయం తెలిసినదే. కిలోమీటర్ల మేర ఇసుక లారీలు ఆగిపోవడం జరిగింది.. దీంతో బుధవారం నాడు స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు స్థానికుల వద్దకు చేరుకొని.. మేము అధికారులతో మాట్లాడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి వచ్చే ఇసుక లారీలను ములుగు జిల్లా మీంచి కాకుండా అటువైపు నుంచే వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని, రోడ్ల సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు. రెండు రోజులుగా ఆగిపోయినటువంటి ఇసుక లారీలు వెళ్లిపోగా.. యాకన్న గూడెం బ్రిడ్జి వద్ద ఇసుక మాఫియా వేసుకున్న సొంత రోడ్డును స్థానికులు జెసిబి సాయంతో చర్ల మండలం నుండి వచ్చే లారీలు ఇటు రాకుండా రోడ్డుని తొవ్వివేశారు. దీంతో చర్ల మండలం నుంచి వచ్చే లారీలు ఆగిపోవడం జరిగింది. అదేవిధంగా రాత్రికి రాత్రి మా ప్రాంతానికి రోడ్లు వేయకపోయినా కనీసం ఉన్న రోడ్ల నైనా మరమ్మత్తులు చేయాలని.. గోతులను పూడ్చాలని.. ప్రతి పంచాయతీ పరిధిలో ట్రాక్టర్ల ద్వారా క్యూరింగ్ చేయడం వలన దుమ్ము నుండి కొంతైనా ఉపశమనం కలుగుతుందని, దీనిపై అధికారులు స్పందించిన యెడల మరల రోడ్డుపై తమ నిరసన తెలియజేస్తామని





# పెద్ద పోచమ్మ ఆలయ ప్రాణ ప్రతిష్ఠాపనకు ముహూర్తం ఖరారు

**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్ 19(డీడీ9 వార్త) :** బోధన్ పట్టణం 16వ వార్డులో పునర్నిర్మిత పెద్ద పోచమ్మ ఆలయంలో ఈ నెల 23న మహా లక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం జరుగనుంది. ఈ వేడుకను పురస్కరించుకుని మూడు రోజులపాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పట్టణ కమిటీ అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారి, ప్రధాన కార్యదర్శి బీర్కూర్ శంకర్ (బుజ్జి) విలేఖరుల సమావేశంలో తెలిపారు. 21న దేవత ఊరేగింపు, గోపూజతో ప్రారంభమై, 22న హోమము, చివరగా 23న యంత్ర, శిఖర, విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమంతో మహోత్సవం ముగుస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ ముఖ్య అతిథులుగా హాజరవుతన్నారని పేర్కొన్నారు. గ్రామస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దివ్యాశీస్సులు పొందాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు సంగ్రామ్, పోశెట్టి, బాలకృష్ణ, గుండెడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# బోడుప్పల్‌లో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు





**బోడుప్పల్,నవంబర్ 19,(డిడి9 వార్త)** భారతదేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని బుధవారం బోడుప్పల్ లో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి అర్పించి కార్యక్రమం ప్రారంభించారు అనంతరం నిర్వహించిన స్మరణ సభలో మాజీ మేయర్ అజయ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ సేవను, దృఢమైన నాయకత్వాన్ని, జాతీయ ఐక్యత కోసం చూపిన అచంచల నిబద్ధతను స్మరించుకున్నారు. మాజీ డిప్యూటీ మేయర్ కిషోర్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ చూపిన ధైర్యం, క్రమశిక్షణ, సేవా భావం నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు యువత ఆమె దేశభక్తిని అనుసరించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ బొమ్మకు కల్యాణ్ మాట్లాడుతూ భారతదేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం చేయడంలో ఇందిరా గాంధీ పోషించిన పాత్ర చాలా గొప్పదని కొనియాడారు పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, విజ్ఞానం సాంకేతిక రంగాలకు ఆమె చేసిన సేవలను గుర్తు చేశారు. దేశ భద్రత కోసం తీసుకున్న కీలక నిర్ణయాలు ఆమె నాయకత్వ ధైర్యానికి నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్త ఇతర మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, లతో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

# బతుకమ్మ చీరల పంపిణీకి అంతా సిద్ధం



**హైదరాబాద్, నవంబర్ 19:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ చీరల పంపిణీ' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం (నవంబర్ 19) ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ పంపిణీ ద్వారా రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు చేనేత వస్త్రాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంపై మంత్రి ధనసరి అనసూయ సీతక్క గారితో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడకుండా, నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కోటి చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులే తయారు చేస్తున్నారు. ఈ భారీ ఆర్డర్ ద్వారా స్థానిక చేనేత పరిశ్రమకు , కార్మికులకు ఆర్థికంగా భారీ చేయూ త లభించనుంది. పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా సాంకేతికతను వినియోగించుకోవాలని, నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సీఎం సూచించారు. పెద్ద సంఖ్యలో చీరలు ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో. పంపిణీ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండేందుకు, ముఖ్యమంత్రి దీనిని రెండు దశల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో భాగంగా.. ఇందిరా గాంధీ గారి జయంతి రోజు నుంచి ప్రారంభించి.. డిసెంబరు 9 (తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం) వరకు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేయాలి. మిగిలిన పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు మార్చి 1 నుంచి మార్చి 8 వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలతో నేరుగా ముఖాముఖి మాట్లాడనున్నారు. రాష్ట్ర మంత్రు లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ద్వారా మహిళల గౌరవాన్ని పెంచడంతో పాటు, చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం.

# వారి వల్లే పార్టీ ఓడిపోయింది బీఆర్ఎస్ కేడర్ సంచలన ఆరోపణలు



**హైదరాబాద్, నవంబర్ 19:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిని చవిచూసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఎన్నిక అనివార్యమవగా.. సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు గులాబీ పార్టీ తీవ్రంగా ప్రయత్నించింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను బరిలో నిలిపింది. సెంటిమెంట్‌తో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలవాలని భావించినప్పటికీ ప్రజలు మాత్రం కాంగ్రెస్‌కే పట్టంకట్టారు. ఫలితంగా ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఓడిపోయింది. ఈ క్రమంలో ఉప ఎన్నికలో ఓటమికి కారణాలపై జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఉప ఎన్నికల్లో ఓటమికి కారణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బైపోల్స్‌లో ఓటమిపై కార్యకర్తల నుంచి కేటీఆర్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. సొంత పార్టీ నాయకుల్లో కొందరు.. కాంగ్రెస్ కోవర్టులుగా పనిచేశారని పలువురు కార్యకర్తలు ఆరోపించారు. సొంత పార్టీ నేతలు సరిగా పనిచేయకపోవడం వలనే బీఆర్ఎస్ ఓడిపోయిం దని గులాబీ కార్యకర్తలు చెప్పుకొచ్చారు. స్థానిక నేతలు, జిల్లాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ నేతల మధ్య సమన్వయ లోపం కూడా ఓటమికి కారణమని నేతలకు చెప్పారు. స్థానిక జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ నేతలు బైపోల్స్‌ను పెద్దగా పట్టించుకోలేదని.. నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నేతలు కరువయ్యారని పార్టీ కార్యకర్తలు తెలిపారు. కాంగ్రెస్ పోల్ మేనేజ్‌మెంట్‌ను ఎదుర్కోలేకపోవటం కూడా ఓటమికి కారణమని సమావేశంలో బీఆర్ఎస్ క్యాడర్ పేర్కొంది.

# శబరిమలలో తెలుగు అయ్యప్ప స్వాములకు ఘోర అవమానం





**హైదరాబాద్, నవంబర్ 19:**/శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లిన తెలుగు భక్తులకు అక్కడ ఘోర అవమానం జరిగింది. అక్కడ సెక్యూరిటీగా ఉన్న పోలీసు.. అయ్యప్ప స్వాముల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం.. దానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో తీవ్ర దుమారానికి కారణం అయింది. ఇక ఈ ఘటనపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. ఆ పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే తెలుగు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి చేశారు. కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో మకరవిళక్కు పూజల కోసం ఇటీవలె దర్శనాలు ప్రారంభం అయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా లక్షలాది మంది అయ్యప్ప స్వాములు, భక్తులు.. శబరిమలకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్కడ భారీ ఎత్తున క్యూలైన్లు కిలోమీటర్ల మేర పెరిగిపోయాయి. రద్దీ ఎక్కువగా ఉండటంతో భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక కొత్తగా శబరిమలకు వెళ్లిన వారికి దర్శనాలకు ఎలా వెళ్లాలి.. ఎక్కడ క్యూలైన్లు ఉంటాయి.. ఎటు వైపు నుంచి వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. ఈ క్రమంలోనే తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన భక్తులకు శబరిమలలో తీవ్ర అవమానకర సంఘటన ఎదురైంది. ఈ ఘటనపై స్పందించిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కొందరు అయ్యప్ప స్వాములు.. తాజాగా శబరిమలకు వెళ్లగా.. దర్శనం కోసం క్యూలైన్ ఎక్కడ అని అడిగినందుకు అక్కడ ఉన్న ఓ కేరళ పోలీస్ అధికారి అసభ్య చేష్టలకు దిగాడు. తన ప్యాంట్ జిప్ ఓపెన్ చేసి అసభ్యకరంగా సైగలు చేసినట్లు ఆ అయ్యప్ప స్వాములు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇక ఆ పోలీస్ అధికారి చేసిన సైగలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆ పోలీస్ అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు.. శబరిమల యాత్రలో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన స్వాములతో అక్కడి పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని వస్తున్న వార్తలు, వీడియోల ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా మండిపడ్డారు. శబరిమల అయ్యప్పను దర్శించుకోవడానికి అయ్యప్ప స్వాములు వస్తే.. వారితో పోలీసులు ఇలా దురుసుగా వ్యవహరించడం అంగీకరించే విషయం కాదని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అయ్యప్ప స్వాములతో అనుచితంగా ప్రవర్తించిన కేరళ పోలీసుపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని రాజీ సింగ్ డిమాండ్ చేశారు. ప్రత్యేక కోఆర్డినేటర్ నియామకంపై సీఎంలకు రాజాసింగ్ విజ్ఞప్తిప్రతీ సంవత్సరం కేరళలో జరిగే మండల, మకరవిళక్కు పూజల కోసం దేశవ్యాప్తంగానే కాకుండా.. తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది భక్తులు శబరిమలకు వెళ్తున్న నేపథ్యంలో.. వారికి అన్ని సౌకర్యాలు, మార్గదర్శనం అందించేందుకు ప్రత్యేకంగా ఒక కోఆర్డినేటర్‌ని నియమించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. భక్తుల సమస్యలు పరిష్కరించేందుకు.. శబరిమలలో భాషకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వారికి సహాయ పడేందుకు ఈ కోఆర్డినేటర్ ఎంతో అవసరమని ఈ సందర్భంగా రాజాసింగ్ తెలిపారు.

# అంగన్వాడి భవనం నిర్మించాలి

**- జి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర**

**వెంకటాపురం (నూగూరు) నవంబర్ 19) డిడి9 వార్త** వెంకటాపురం మండలం కమ్మరిగూడెం గ్రామంలో నూతన అంగన్వాడి భవనం నిర్మించాలని జి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కమ్మరిగూడెం గ్రామంలో నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ బెస్త గూడెం గ్రామపంచాయతీ కమ్మరిగూడెం గ్రామంలో అంగనవాడి నూతన భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్న పిల్లలకు అంగనవాడి భవనం లేక చిన్నారులు చాలా ఇబ్బంది పడుతున్నారని అద్దె రూములో, చిన్న పిల్లలకు బాలింతలకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ వెంటనే స్పందించి నూతన అంగన్వాడి కేంద్రాన్ని నిర్మించాలని ములుగు జిల్లా జిల్లా కలెక్టర్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ఈ సందర్భంగా కోరారు. అలాగే బెస్త గూడెం అంగన్వాడి కేంద్రాన్ని మరమ్మతులు చేయాలని ఆయన కోరారు. బెస్త గూడెం అంగనవాడి భవనం ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల కేంద్రంలో అంగనవాడి కేంద్రాలు లేక అనేక రకములుగా చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాగరాజు అనీల్, వంశి తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరి ఆగకూడదంటే సిగరెట్లు ఆపాలి

**హైదరాబాద్ సిటీ:** ఊపిరి ఆగకుండా ఉండాలంటే పొగతాగడం ఆపాల్సిందేనని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ సీఓపీడీ డే సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రిలో మంగళ వారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీందర్ రెడ్డితో కలిసి సీఓపీడీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎక్కువ కాలం పాటు పొగతాగడం వల్ల క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) వచ్చే అవకాశముందని, నయం చేయడానికి సాధ్యం కాని ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే ధూమపానం మానేయాలని సూచించారు. కామినేని ఆస్పత్రి సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఓపీడీ సాధారణంగా 60 ఏళ్లు దాటిన తర్వాత వచ్చే సమస్య, ఎప్పుడో సిగరెట్‌లు కాల్చి మానేశామనుకున్నా అప్పటికే నష్టం జరిగి ఉండవచ్చని అన్నారు. సిగరెట్‌లు తాగేవారితోపాటు పొగ పొయ్యిల వద్ద పనిచేసేవారికి కూడా ఈ సమస్య వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు. సీఓపీడీ సమస్యను వీలైనంత ముందుగా గుర్తిస్తే నష్టాన్ని కొంతవరకైనా తగ్గించే అవకాశముందని అన్నారు. పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ ఒకటే మార్గమని, దీనికి రూ. 3వేల వరకు ఖర్చు అవుతుందని,

# వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

**హైదరాబాద్, నవంబరు18 :** వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ శివశంకర్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఓ పార్కు స్థలానికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం లో.. ఆయనపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వేటు వేసింది. కొన్ని నెలల క్రితమే ఇక్కడ పనిచేసిన రాజేశ్ అనే సబ్ రిజిస్ట్రార్ అనిశాకు చిక్కడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ క్రమంలో సీనియర్ అసిస్టెంట్ శివశంకర్‌కు సబ్ రిజిస్ట్రార్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది తెలంగాణ ప్రభుత్వం. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని 200 సర్వే నంబరులో వివాదానికి కారణమైన ఓ పార్కు స్థలం ఉంది. ఈ ప్రాంతంలో పూర్వకాలంలో ఉన్న లే అవుట్(అనధికారిక) ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. స్థానికులు వివిధ కోర్టులను ఆశ్రయించి అనుమతులు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలోనే పార్కు ఉన్న ప్రాంతానికి కూడా బై నంబరుతో కొందరు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేయగా.. సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఈ వ్యవహారంపై స్థానికులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. పలు డాక్యుమెంట్లకు ఒకే ప్రాంతం ఫొటోలు చూపించినా రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం, పార్కు స్థలం ఉన్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినా సబ్‌రిజిస్ట్రార్ శివశంకర్ ఉదాసీనంగా వ్యవహరించినట్లు తేలింది. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలోనే వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ శివశంకర్ తప్పు ఉందని విచారణలో గుర్తించడంతో సస్పెన్షన్ వేటు వేశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల అవినీతి నిరోధక శాఖ దాడుల నేపథ్యంలో కార్యాలయాల్లో ఉన్న లోపాలపై ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక సంస్కరణలు తీసుకొస్తున్నప్పటికీ సంబంధిత ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు అసహనం వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి.


# స్థానిక ఎన్నికల్లో మహిళా ఓట్ల కోసమే ఇందిరమ్మ చీరల పంపిణీ

**తుంగతుర్తి, నవంబర్ 19 :** కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో మహిళల ఓట్లు దండుకోవడానికే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని బీఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆరోపించారు. బుధవారం మండలంలోని బండరామారంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగకు ప్రతి మహిళకు చీర అందించి వారి కండ్లల్లో ఆనందాన్ని కల్పిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల సందర్భంగా ఎలాంటి పండుగ లేకపోయినా మహిళల పట్ల కపట ప్రేమ చూపిస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ యెడల మహిళలు వ్యతిరేకత పెంచుకుని కోపంతో ఉన్నారని గ్రహించిన ప్రభుత్వం ఎలాగైనా సర్పంచ్ ఎన్నికల్లో చీరలు పంపిణీ చేసి మహిళల ఓట్లు దండుకుందామనే చూస్తుందన్నారు. కానీ మహిళలు నమ్మే పరిస్థితిలో లేరని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మహిళలు తగిన బుద్ధి చెప్తారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసిలుగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# కమీషన్ల కోసమే ఉమామహేశ్వర రిజర్వాయర్

**నాగర్ కర్నూల్ :** కాంగ్రెస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి ఉమామహేశ్వర రిజర్వాయర్ ను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని బల్మూరు రైతులు ఆరోపించారు. భూముల జోలికి వస్తే ఖబర్దారని రైతులు హెచ్చరించారు . కాంగ్రెస్ ప్రభుత్వానికి పంట బోనస్ ఇవ్వడానికి మొఖం లేదు కానీ రిజర్వాయర్ కడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో ఆలయం ఎదుట హామీలిచ్చి రిజర్వాయర్‌ను కట్టమని చెప్పినా నాయకులే నేడు రైతులకు అవసరం లేని రిజర్వాయర్ నిర్మించేందుకు బలవంతంగా భూములు లాక్కోవాలని చూస్తే సహించబోమని అన్నారు. కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, ఇంజినీర్లను బతికించడానికి ప్రాజెక్టును కడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు జోలికి రావొద్దని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని, రిజర్వాయర్ కోసం విలువైన మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామిక దేశంలో రాజరీక పాలన సాగదని హెచ్చరించారు.

# న్యాయ విచారణ జరపాల్సిందే సీపీఎం డిమాండ్



**విజయవాడ, నవంబర్ 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో నిన్న, ఈరోజు జరిగిన వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి, అరెస్టు చేసి కోర్టు ముందు ఉంచే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు అన్యాయంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని వార్తలు వచ్చాయన్నారు. చట్ట విరుద్ధమైన బూటకపు ఎన్‌కౌంటర్లను సీపీఎం ఖండిస్తుందని తెలిపారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ వంటి నగరాల్లో పోలీసులు దాడులు చేసి 50 మందికి పైగా మావోయిస్టులు, వారి అనుయాయులను నిర్బంధించారన్నారు.వివిధ చోట్ల నిర్బంధించబడిన వీరిని వెంటనే సంబంధిత న్యాయ స్థానాల ముందుంచాలని కోరారు. అమాయక గిరిజనులను మావోయిస్టులకు సహకరిస్తున్నారని, మిలిషియాగా పనిచేస్తున్నారని పోలీసులు వివిధ రూపాల్లో వేధిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. వేధింపులను, నిర్బంధాన్ని వెంటనే నిలిపివేయాలనిసీపీఎం నేత శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.కాగా.. రాష్ట్రంలోని వివిధ జిల్లాలో పట్టుబడ్డ 50 మంది మావోయిస్టులను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. వైద్య పరీక్షల అనంతరం వారందరినీ పోలీసులు న్యాయమూర్తి ముందు ఉంచారు. వీరికి కోర్టు రిమాండ్ విధించింది. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఐదుగురు మావోయిస్టులు మరణించారు. అలాగే కూడా అదే ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగగా... కీలక నేతలు హతమైన విషయం తెలిసిందే.


# హిడ్మాను పోలీసులు పట్టుకొని చంపేశారు

పోలీస్ ఎన్‌కౌంటర్లో నిన్న మృతి చెందిన మావోయిస్ట్ నేత హిడ్మాను పోలీసులు పట్టుకొని చంపేశారని మావోయిస్టు మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు జంపన్న ఆరోపించారు. ఈ అంశంపై జంపన్న ఏబీఎన్ తో మాట్లాడారు. మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీలో తాను 17 ఏళ్ళ పాటు పని చేశానని, మావోయిస్టు పార్టీ ఇప్పుడు పూర్తిగా క్షీణించిందని ఆయన అన్నారు.భద్రత దళాలకు ఇన్‌ఫార్మార్ వ్యవస్థ గతం కంటే భారీగా పెరిగిందని, మరో వైపు మావోయిస్టులకంటే పోలీసులకు టెక్నాలజీ, అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయని జంపన్న చెప్పారు. 'హిడ్మాను పోలీసులు పట్టుకొని చంపేశారు.. ఇది బూటకపు ఎన్‌కౌంటర్. ఎదురు కాల్పులు జరిగినట్లు ఎక్కడా ఆనవాళ్లు లేవు. ఏపీలో ఎవరినైనా చంపాలనుకుంటే అంతమంది మావోయిస్టులు యాక్షన్ చేయరు. ఏదైనా టార్గెట్‌లో యాక్షన్ చేయాలి అంటే ఐదు మందికి మించి ఉండరు. పదుల సంఖ్యలో యాక్షన్ అనేది పార్టీ అనుమతించదు. ఈ ఎపిసోడ్‌లో మధ్యవర్తిత్వం చేసిన వారు మోసం చేసినట్లు కనిపిస్తుంది.' అని జంపన్న వ్యాఖ్యానించారు.'పార్టీలో హిడ్మాకు మంచి గుర్తింపు ఉంది. యాక్షన్ చేయడంలో హిడ్మా దిట్ట. నేను కేంద్ర కమిటీలో ఉన్న సమయంలో పలు సందర్భాల్లో హిడ్మాతో నాకు పరిచయం ఉంది. హిడ్మా యాక్షన్లో ఉన్నాడు అంటే.. సక్సెస్ చేసుకొనే వస్తాడు అనే నమ్మకం పార్టీలో ఉంది. యాక్షన్ చేయాలి అంటే ఒక వ్యక్తి నిర్ణయం ఉండదు. పార్టీ నాయకత్వం నిర్ణయం ప్రకారమే యాక్షన్ చేయాల్సి ఉంటుంది. మావోయిస్టులు అడవుల్లో ఉండి ప్రాణాలు కోల్పోకండి.' అని జంపన్న మావోలకు హితవు పలికారు.'పోలీసులు ముందు లొంగిపోవడం అవమాన కరం ఏమి కాదు.. ప్రజల్లో ఉండి ప్రజలకోసం పోరాటం చేయొచ్చు.. ప్రాణాలతో ఉండడం చాలా ముఖ్యం. హిడ్మా తరువాత మావోయిస్టు పార్టీ కనుమరుగైందనేది నేను నమ్మను. ఇక కేంద్ర కమిటీలో దేవ్ జీ , గణపతి, పల్లా రాజిరెడ్డి, గణేష్, సాగర్, జనార్దన్ తోపాటు ఇంకా కేంద్ర కమిటీలో ఉన్నారు. ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, బీహార్, మధ్య ప్రదేశ్‌లో ఇంకా మావోయిస్టులు సాయుధ పోరాటం చేస్తున్నారు.' అని జంపన్న తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.




# మద్యం కుంభకోణంలో కీలక పరిణామం

**అమరావతి, నవంబర్ 19:** వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. లిక్కర్ స్కాంలో నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్ ప్రక్రియకు సర్కార్ అంగీకారం తెలిపింది. కీలక నిందితుడైన వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుటుంబ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ స్కాంలో చెవిరెడ్డి కుటుంబం కమిషన్లు, కిక్ బ్యాక్‌లు తీసుకుని భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు సిట్ తేల్చింది. సిట్ దర్యాప్తు నివేదిక, విన్నపం మేరకు చెవిరెడ్డి ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతిస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, పేరిట ఉన్న ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. కేవీఎస్ ఇన్ ఫ్రా ఎండీగా ఉన్న చెవిరెడ్డి లక్ష్మీకాంతమ్మ అలియాస్ లక్ష్మి పేరిట ఆస్తులతో పాటు.. సీఎంఆర్ ఇన్ ఫ్రా పేరిట చెవిరెడ్డి మరో కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేరిట ఉన్న ఆస్తులను అటాచ్‌మెంట్ చేయనున్నారు.మద్యం కుంభకోణం అక్రమాలతో చెవిరెడ్డి కుటుంబం రూ.63. 72 కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టారని దర్యాప్తులో వెల్లడైంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల విలువను కేవలం 8 కోట్ల 85 లక్షల 47 వేల 693గా తగ్గించారని సిట్ పేర్కొంది. రూ.54 కోట్ల 87 లక్షల 17 వేల 107 కంటే ఎక్కువ మొత్తాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని సిట్ అధికారులు తేల్చారు. చెవిరెడ్డి కుటుంబం రూ.54.87 కోట్లకుపైగా మొత్తాన్ని లెక్కల్లో చూపకుండా బ్లాక్ మనీగా మలచినట్లు గుర్తించింది. తిరుపతి జిల్లా చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, తొట్టంబేడు జాయింట్ రిజిస్ట్రార్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసినట్లు బయటపడింది.నెల్లూరు జిల్లా గూడూరు, పొదలకూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ల వద్ద రిజిస్టరైన ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వం ఆదేశించింది. చిత్తూరు జిల్లా పుత్తూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిందితుడు చెవిరెడ్డి కుటుంబం పేర్లతో రిజిస్ట్రేషన్ అయినట్లు సిట్ గుర్తించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చెవిరెడ్డి కుటుంబం మోసపూరిత భూ లావాదేవీలు భారీగా చేసినట్లు సిట్ నిర్ధారించింది. వెంకటేం లోని అరబిందో ఫార్మాకు కేవీఎస్ ఇన్‌ఫ్రా ద్వారా 263.28 ఎకరాల భూమి కొనుగోలు, అమ్మకంలో మోసం జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. తక్కువ సమయంలోనే భూమి విలువలను అసాధారణంగా పెంచి సద్వినియోగం చేసి తెల్లగా మార్చారని సిట్ నివేదించింది. ఈ లావాదేవీల ద్వారానే కేవీఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ రూ.13.3 కోట్ల బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చారని తేల్చింది. మద్యం కుంభకోణం నుంచి కమిషన్లు, కిక్ బ్యాక్‌లతో చెవిరెడ్డి కుటుంబం భారీగా స్థిర, చర ఆస్తులను కూడబెట్టారని దర్యాప్తులో బయటపడింది.అవినీతి నిరోధక చట్టం, క్రిమినల్ లా లోని పలు సెక్షన్ల ప్రకారం అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని ప్రభుత్వాన్ని సిట్ కోరింది. ఆస్తుల అటాచ్‌మెంట్‌కు విజయవాడ కోర్టులో దరఖాస్తు చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీని సర్కార్ ఆదేశించింది. ఈ మేరకు ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.



# ఏసీబీ కోర్టు ముందు లొంగిపోవాలంటూ మద్యం స్కాం నిందితులకు హైకోర్టు ఆదేశం





**అమరావతి, నవంబర్ 19:** ఏపీలోని మద్యం కుంభకోణం కేసులో రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు బాలాజీ గోవిందప్పలకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని సిఐడీ వేసిన పిటిషన్‌ను బుధవారం ఏపీ హైకోర్టు విచారించింది. అందుకు సాక్షికంగా హైకోర్టు అనుమతించింది. నవంబర్ 26వ తేదీలోగా ఏసీబీ కోర్టు ముందు సరెండర్ కావాలని వారికి స్పష్టం చేసింది. రెగ్యులర్ బెయిల్ దాఖలు చేసుకునేందుకు వారికి అనుమతి ఇచ్చింది. ప్రస్తుత ఉత్తర్వులతో సంబంధం లేకుండా మెరిట్స్ ఆధారంగా బెయిల్ పిటిషన్లపై విచారణ జరపాలని ఏసీబీ కోర్టుకు ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరపాలని ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు రూ. 3500 కోట్ల మేర మద్యం కుంభకోణం జరిగినట్లు ఈ దర్యాప్తులో తేలింది. ఈ స్కాంలో భారీగా ఆరోపణలు జరిగాయి. ఈ స్కాంలో భారీగా నగదు పొందిన కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి.. హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఆస్తులు కూడబెట్టాడు. వాటిని సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.ఇక ఈ విచారణలో అతడు వెల్లడించిన అంశాలు ఆధారంగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఏ 31గా ధనుంజయ్ రెడ్డి, ఏ 32గా కృష్ణమోహన్ రెడ్డితోపాటు ఏ 33గా బాలాజీ గోవిందప్ప ఉన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో ఈ ముగ్గురికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఏసీబీ కోర్టు జారీ చేసిన ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఏపీ హైకోర్టులో సిఐడీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆనంద్ మహీంద్రా ట్వీట్‌కు ఏపీ సీఎం రీట్వీట్



**అమరావతి, నవంబర్ 19:** సోషల్ మీడియా ఎక్స్‌లో ఆనంద్ మహీంద్రా చేసిన ట్వీట్‌కు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఆనంద్ జీ మంచి మాటలకు ధన్యవాదాలు అంటూ రీట్వీట్ చేశారు ముఖ్యమంత్రి. భారత్ గొప్ప మార్పు దిశగా ముందడుగు వేస్తోందని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం సరికొత్త దారులను పాలసీ రూపకల్పనల ద్వారా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందంటూ చంద్రబాబు రీట్వీట్ చేశారు. అంతకుముందు.. టెక్ దిగ్గజం ఆనంద్ మహీంద్రా.. చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. ప్రకృతిలో నిలువరించలేని బలం కలిగిన వ్యక్తి ఈ మనిషి అంటూ సీఎంను ఉద్దేశించి ఎక్స్ వేదికగా కొనియాడారు. దశాబ్దాలుగా తాను కేవలం అభివృద్ధినే చూడటం లేదని, పాలసీలను కూడా వినూత్నంగా రూపొందించడం గమనిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన తన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడమే కాకుండా, తన చుట్టూ ఉన్నవారి సామర్థ్యాన్నీ పెంచగలడంటూ విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్ వీడియోలో ఆనంద్ మహీంద్రా చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. దీనికి ప్రతిగా తాజాగా ఏపీ సీఎం రీట్వీట్ చేశారు.

# బాబా చూపిన బాటలోనే నడుద్దాం



**శ్రీ సత్యసాయి జిల్లా , నవంబర్ 19:** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాల సందర్భంగా హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. మనుషుల్లో ప్రేమ ఉన్నంత వరకు సత్యసాయి బాబా మన మధ్యే ఉంటారన్నారు. ఇక్కడకు వచ్చినపుడల్లా బంగారం అని బాబా పిలిచినట్లుగా అనిపిస్తుందని సత్యసాయి బాబాను స్మరించుకున్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చూపిన బాటలో మనమంతా నడవాలన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో సత్యసాయి ట్రస్ట్ విద్య, వైద్య సేవలు అందిస్తోందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.కాగా.. సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ముందుగా సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాల్లో మోదీ పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్ పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా బాబా జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను మోదీ ఆవిష్కరించారు. వీవీఐపీల రాక సందర్భంగా పుట్టపర్తిలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# చరిత్రలో ఇదే ప్రథమం మావోల అరెస్ట్‌పై ఏడీజీ



**విజయవాడ, నవంబర్ 19:** మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్, ఏపీలోని ఐదు జిల్లాల్లో పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన వివరాలను అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా మీడియాకు వివరించారు. మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్, ఏపీలో ఐదు జిల్లాల్లో పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన వివరాలను అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా మీడియాకు వివరించారు. అంతేకాకుండా ఈరోజు కూడా ఏజెన్సీలో నక్సల్స్, పోలీసులకు మధ్య కాల్పులు జరిగినట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటల సమయంలో ఏజెన్సీలో కాల్పులు జరిగాయని.. ఏడుగురు నక్సలైట్స్ చనిపోయారని తెలిపారు. వీరిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారన్నారు.వారిని పూర్తిగా గుర్తించాల్సి ఉందని చెప్పారు. మారేడుమిల్లిలో నిన్న జరిగిన ఎన్‌కౌంటర్ ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈరోజు ఎన్‌కౌంటర్ జరిగినట్లు వెల్లడించారు. చనిపోయిన వారిలో జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఒక్కరినే గుర్తించామని తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన జోగారావు పదేళ్లుగా మావోగా ఉన్నారని. ఇతర సమాచారాన్ని త్వరలోనే వెల్లడిస్తామని ఏడీజీ తెలిపారు.ఏడీజీ ఇంకా మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీకి రావాలని మావోయిస్టులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిఘా వర్గాలు వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. నవంబరు 17న కీలకమైన ఆపరేషన్ చేపట్టామని.. నిన్న మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా, మరో ఐదుగురు ఎన్ కౌంటర్‌లో చనిపోయినట్లు చెప్పారు. వాళ్ల నుంచి సేకరించిన సమాచారంతో ఎక్కడెక్కడ మావోయిస్టులు ఉన్నారని దృష్టి పెట్టామని అడిషనల్ డీజీ వెల్లడించారు. ఎన్టీఆర్, కృష్ణా, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల నుంచి యాభై మంది మావోయిస్టులను పట్టుకున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎవరికీ ప్రమాదం జరగకుండా ఆపరేషన్ పూర్తి చేశామన్నారు.రాష్ట్ర చరిత్రలో ఇంతమంది కీలక వ్యక్తులను పట్టుకోవడం ఇదే ప్రథమమన్నారు. కేంద్ర, రాష్ట్ర, ఏరియా, కమిటీ సభ్యులు, ఫ్లాటూన్ టీంలను పట్టుకున్నట్లు తెలిపారు. వారిని నుంచి వెపన్స్ 45, 272 రౌండ్స్, రెండు మ్యాగజైన్, 750 గ్రాముల వైర్, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తమ ఫీల్డ్ సిబ్బంది ప్రణాళిక ప్రకారం ఆపరేషన్ పూర్తి చేశారన్నారని.. ఇందులో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలియజేశారు. ఇంటలిజెన్స్ విభాగం ఈ విషయంలో బాగా పని చేసిందని కొనియాడారు. ముందే సమాచారం వచ్చినప్పటికీ వారిపై నిఘా పెట్టామని.. వారి ఆలోచనలు, కార్యకలాపాలను గమనిస్తున్నట్లు వివరించారు.అన్నీ సెట్ చేసుకున్నాక ఒకేసారి వారందరినీ పట్టుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొంతమంది ఇటీవల సరెండర్ అయ్యారని.. వాళ్ల ద్వారా సమాచారం వెళితే ఇబ్బందులు ఉంటాయని మావోలు భావించారన్నారు. అందుకే కొన్ని రోజులు షెల్టర్ తీసుకునేందుకు ఏపీలో పలు ప్రాంతాలను ఎంచుకున్నారనట్లు చెప్పుకొచ్చారు. మళ్లీ సమయం చూసి వాళ్ల ప్రాంతాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని. మావోల మూమెంట్, ప్లాన్లపై ఇతర సమాచారం లేదన్నారు. హిడ్మాను పట్టుకున్నాక చంపామనేది ప్రచారంలో నిజం లేదని అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా స్పష్టం చేశారు.

# 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లే లక్ష్యం



**కృష్ణా జిల్లా, నవంబర్ 19:** జిల్లాలో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి మచిలీపట్నంలో ధాన్యం సేకరణను నాదెండ్ల పరిశీలించారు. సుల్తానగరం లోని సీతారామాంజనేయ రైస్ మిల్లును సందర్శించారు. ధాన్యం మిల్లింగ్, లోడింగ్ ను పరిశీలించి అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని తెలిపారు. 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.4 వేల రైతు సహాయ కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. 17 వేల మంది సిబ్బంది ధాన్యం కొనుగోళ్లలో సేవలు అందిస్తున్నారని చెప్పారు. 30 వేల ట్రాన్స్ పోర్ట్ వెహికల్స్‌ను వినియోగిస్తున్నామని.. 6.50 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. కృష్ణా జిల్లాలో ఇప్పటి వరకు 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల్లో నమ్మకం కలిగే విధంగా 4 గంటల్లోనే చెల్లింపులు చేస్తున్నామన్నారు.దీని వల్ల రైతులను దళారీ వ్యవస్థను కాపాడగలుగుతున్నామని వెల్లడించారు. అకాల వర్షాల బారి నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్లు కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతు ఆరుగాలం కష్టించి పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి బిగ్ షాక్



**అమరావతి, నవంబర్ 19:** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కి బిగ్ షాక్ తగిలింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆస్తుల జప్తునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిందితుడిగా ఉన్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటుగా ఆయన తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కూడా ఏపీ లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు మద్యం కుంభకోణంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిందితుల ఆస్తులను జప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబసభ్యుల ఆస్తుల జప్తునకు సిట్ అనుమతి కోరగా.. ఏపీ ప్రభుత్వం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి పేరిట ఉన్న ఆస్తులను జప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు మద్యం కుంభకోణంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం కమీషన్ల ద్వారా చెవిరెడ్డి కుటుంబం అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించింది. సుమారుగా రూ.54 కోట్లను బ్లాక్ మనీగా మార్చినట్లు తేల్చింది. ఈ నేపథ్యంలోనే చెవిరెడ్డి కుటుంబం ఆస్తుల జప్తునకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. తర్వాతి చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తూ ఏపీ హోం శాఖ ముఖ్య కార్యదర్శి విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని చెవిరెడ్డి కుటుంబానికి ఉన్న పలు ఆస్తులు జప్తు చేసే అవకాశాలు ఉన్నాయి. ఏపీ మద్యం కుంభకోణంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏ38గా, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఏ39గా ఉన్నారు.మరోవైపు మద్యం కుంభకోణం కేసులో నిందితుల ఆస్తులను జప్తు చేసేందుకు విజయవాడ ఏసీబీ కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఇటీవల అనుమతి ఇచ్చింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 11 మంది నిందితుల ఆస్తులు జప్తు చేసేందుకు నవంబర్ నెల ప్రారంభంలో ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో సిట్ అధికారులు నిందితుల ఆస్తులు జప్తు చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగానే చెవిరెడ్డి కుటుంబం ఆస్తుల జప్తు కోసం అనుమతి కోరగా.. ప్రభుత్వం అందుకు అనుమతి ఇచ్చింది.

# జేడీయూ శాసనసభా పక్ష నేతగా నితీశ్ ఎన్నిక



**పాట్నా:** జనతా దళ్ యునైటెడ్ శాసనసభా పక్ష నేతగా ఆ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాట్నాలో బుధవారంనాడు జరిగిన పార్టీ అంతర్గత సమావేశంలో నితీశ్ ఎన్నిక జరిగింది. దీంతో ఈరోజు సాయంత్రం ఎన్డీయే నేతగా నితీశ్ ఎన్నికయ్యేందుకు మార్గం సుగమమైంది. నితీశ్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఈనెల 20న ప్రమాణస్వీకారం చేయనున్నట్టు పార్టీ నేతలు తెలిపారు. గవర్నర్‌ను కలుసుకోనున్న నితీశ్‌నితీశ్ కుమార్ బుధవారం సాయంత్రం గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను కలుసుకునే అవకాశం ఉంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాల్సిందిగా గవర్నర్‌కు ఆయన విజ్ఞప్తి చేయనున్నారు. ఎన్డీయే నేతల మద్దతు లేఖను కూడా గవర్నర్‌కు అందజేస్తారు. పదవసారి ముఖ్యమంత్రిగానితీశ్ కుమార్ రికార్డు స్థాయిలో 10వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పాట్నాలోని గాంధీ మైదానంలో 20వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ఈ కార్యక్రమ సన్నాహకాలను నితీశ్ మంగళవారంనాడు స్వయంగా సమీక్షించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధానిలోనూ, గాంధీ మైదాన్ చుట్టూ భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్డీయే కూటమి ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 243 స్థానాలకు 202 సీట్లు గెలిచి భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. మహాగఠ్‌బంధన్ 35 స్థానాలకే పరిమితమైంది. ఎన్డీయే కూటమిలోని బీజేపీ 89 సీట్లు, జేడీయూ 85 సీట్లు, ఎల్‌జేపీఆర్‌వీ 19, హెచ్ఏఎంఎస్ 5, ఆర్ఎల్ఎం 4 సీట్లు గెలుచుకున్నాయి. మహాకూటమిలోని ఆర్జేడీ 25 సీట్లు, కాంగ్రెస్ 6, సీపీఐఎంఎల్ 2, ఐఐపీ 1, సీపీఎం 1 స్థానం గెలుచుకున్నాయి. స్వతంత్రంగా పోటీ చేసిన ఏఐఎంఐఎం 5, బీఎస్పీ ఒక సీటు గెలుచుకున్నాయి.

# ఏం చేస్తారో తెలియదు కోవైలో అన్నీ గెలవాల్సిందే



**చెన్నై:** వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కోయంబత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులే గెలవాలని, ఆ దిశగా నియోజకవర్గాల ఇన్‌చార్జులు గట్టిగా ప్రయత్నించాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని స్టాలిన్ జూలై నుంచి 'ఉడన్ పిరప్పే వా' పేరుతో నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆయన 80 నియోజక వర్గాల నేతలతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో కోయంబత్తూరు జిల్లాలోని సూలూరు, కినత్తుకడవు, వాల్పారై నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో వరుసగా సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో డీఎంకే లేదా దాని మిత్రపక్షాల్లో ఏ పార్టీ అభ్యర్థిని నిలబెడితే సులువుగా గెలుస్తారో సూచించాలని, డీఎంకే తరఫున పోటీ చేయడానికి అంగబలం, ఆర్థిక బలం కలిగిన అభ్యర్థులుంటే తమకు ప్రతిపాదనలు పంపాలని స్టాలిన్ కోరారు. అదే సమయంలో కోయంబత్తూరు జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ జిల్లా అంతటా అన్ని నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థుల విజయానికి ప్రణాళికలు, వ్యూహరచన రూపొందించుకుని ఇంటింటి ప్రచారానికి వెళ్ళాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో ఆ జిల్లాలో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులెవరూ గెలువకుండా చూడాలని స్టాలిన్ కోరారు. ప్రధాని మోదీకి సీఎం లేఖరాష్ట్రంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వరిలో తేమశాతాన్ని 17 నుండి 22 శాతంగా పెంచాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ఓ లేఖ రాశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా ధాన్యం దిగుబడి వచ్చిందని, ప్రస్తుతం వర్షాల వల్ల ప్రభుత్వ గోదాముల్లో ఉన్న వరిలో తేమ శాతం పెరుగుతూనే ఉంటుందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని 22 శాతం తేమ కలిగిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీ వెళ్లినా మార్పులు లేనట్టేనా




**బెంగళూరు:** రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనాలు ఉంటాయని, ఎటువంటి నిర్ణయమైనా జరగవచ్చునని రాష్ట్ర పార్టీ నాయకులు భావించారు. అందుకు అనుగుణంగానే కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయి. 15న ఢిల్లీ వెళ్లి మంత్రివర్గ విస్తరణకు అనుమతులు తీసుకొస్తానని స్వయానా సీఎం సిద్దరామయ్య రెండువారాలక్రితమే ప్రకటించారు. మరికొందరు ఇదే ముహూర్తమని డీసీఎం డీకే శివకుమార్‌కు కీలకమైన పదవి సాధ్యమవుతుందన్నారు. ఇలా మలుపులు తిరిగాయి. మూడురోజులపాటు సీఎం, డీసీఎంలు ఢిల్లీలో ఉండడంతో వివాదం మరింత రచ్చే అయ్యింది. క్షణంలో ఎటువంటి సంచలన నిర్ణయమైనా బహిరంగం కావచ్చునని భావించారు. ఇలా మూడురోజులపాటు సాగిన ఉత్కంఠకు తెరపడింది. 15న సీఎం సిద్దరామయ్యఢిల్లీ వెళ్లి ఒంటరిగా రాహుల్‌గాంధీని కలిశారు. కాసేపటికే డీసీఎం డీకే శివకుమార్ కూడా ఢిల్లీ చేరుకున్నారు. రాహుల్‌గాంధీ నేరుగా సిద్దరామయ్యను మళ్లెప్పుడు వస్తారు, అగ్రనేతలు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో చర్చించాలని సూచించారు. సోమవారం ప్రధానమంత్రితో అపాయింట్‌మెంట్ ఉందని, ఢిల్లీలో అందుబాటులో ఉంటానని రాహుల్‌గాంధీకి వివరించారు. దీంతో ఖర్గే తీసుకునే నిర్ణయం అమలవుతుందని భావించారు. ఈలోగా మూడు రోజులు ఢిల్లీలోనే గడిపిన డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్‌లు ఖర్గేను కలిశారు. సోమవారం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత ప్రధానితో కలసి, ఆ తర్వాత రాత్రి మల్లికార్జును ఖర్గేను భేటీ అయ్యారు. సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ప్రధానంగా రాహుల్‌గాంధీ సూచించిన అంశాలను ప్రస్తావించినట్టు తెలిసింది. ప్రస్తుతానికి ఎటువంటి చర్యలు వద్దంటూ సున్నితంగా ఖర్గే తిరస్కరించినట్టు తెలుస్తోంది. దీన్నిబట్టి ప్రస్తుతానికి మంత్రివర్గ ప్రక్షాళన, విస్తరణ వంటి అన్ని అంశాలకు తెరపడినట్టు అయ్యింది. ఒకవేళ అధిష్ఠానం అంగీకరించినా మరో 15రోజుల్లో బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు ఉన్నందున ఆ తర్వాతనే విస్తరణ చేయాలని ఆలోచించారు. రాష్ట్రంలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన ముగుస్తున్న తరుణంలో ఎటువంటిమార్పులు, సంచలనాలు లేవని అధిష్ఠానం తేల్చేసింది.

# గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు తీసుకొచ్చిన ఎన్ఐఏ



**న్యూ ఢిల్లీ :** ఎన్‌సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య కేసులో కీలక నిందితుడైన అన్మో ల్ బిష్ణోయ్‌ను అమెరికా డిపోర్ట్ చేయగా, అతనిని ఎన్ఐఏ అధి ారులు భారత్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు మరో 199 మం దిని కూడా అమెరికా డిపోర్ట్ చేసింది. వారిలో ఇద్దరు పంజాబ్ మోస్ట్ వాంటెడ్ జాబితా ఉండగా, మరో 197 మంది అమెరి కాలో అక్రమంగా నివసిస్తున్నవారు కావడం గమనార్హం. బుధవా రం మధ్యాహ్నం దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమా నాశ్రయంలో, వీరిని తీసుకొచ్చిన ఫ్లైట్ ల్యాండ్ అయ్యిందని అధికా రులు తెలిపారు. అమెరికా నుంచి తీసుకొచ్చిన గ్యాంగ్ స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను దిల్లీలోని పటియాలా హౌస్ కోర్టులో హాజరు పరుస్తారని సమాచారం. వాస్తవానికి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తమ్ముడే ఈ అన్మోల్‌బిష్ణోయ్ గతేడాది ఏప్రిల్ నెలలో బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పులకు బాధ్యత వహిస్తూ స్వయంగా ఇతనే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం గమనార్హం. దీనితో ముంబయి పోలీసులు ఇతనిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అన్మోల్ బిష్ణోయ్ చాలా కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో కూడా ఇతను అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అయితే మూసేవాలా హత్యకు కొన్ని రోజుల ముందు అన్మోల్ నకిలీ పత్రాలు ఉపయోగించి దేశం దాటి వెల్లాడని నిఘా వర్గాలు గుర్తించాయి. అతనిపై వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 వరకు కేసులు నమోదు అయ్యాయి. అతని గురించి సమాచారం ఇచ్చిన వారికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రూ.10 లక్షల రివార్డు కూడా ప్రకటించడం గమనార్హం. అన్మోల్ బిష్ణోయ్ విదేశాల్లోనూ క్రిమినల్ కార్యకలాపాలు నిర్వహించే వాడు. అక్కడ నుంచే ఆజ్ఞలు ఇస్తూ, తన అనుచరులతో భారత్‌లో పలు క్రైమ్స్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. అందుకే అతడిని భారత్‌కు రప్పించేందుకు ముంబయి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే గతేడాది అన్మోల్ అమెరికా పోలీసులకు చిక్కాడు. దీనితో అతనిని అప్పగించాలని ఎంఐఏ అధికారులు అమెరికాలోని ఎఫ్‌బీఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెూంల్యాండ్ సెక్యూరిటీలతో సంప్రదింపులు జరిపారు. దీనితో అమెరికా అన్మోల్ బిష్ణోయ్‌ను డిపోర్ట్ చేసింది. ఉగ్రవాద సంస్థల జాబితాలోకి బిష్ణోయ్ గ్యాంగ్‌అంతకు ముందు ఇటీవలె భయం, భయానక వాతావరణం సృష్టిస్తోందంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాం గ్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చింది కెన డా ప్రభుత్వం. తమ దేశంలో హింస, ఉగ్రవాద చర్యలకు స్థానం లేదని కెనడా ప్రభుత్వం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. ముఖ్యంగా నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకొని భయం, బెదిరి ంపు వాతావరణాన్ని సృష్టించే కార్యకలాపాలకు తమ దేశంలో చోటులేదని పేర్కొంది. భారత జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ ఇటీవల కెనడా ఎన్ఎస్ఏ నథాలీ డ్రౌయిన్‌తో విస్తృత సంప్రదింపులు చేపట్టారు. ఈ క్రమంలో బిష్ణోయ్ గ్యాంగ్‌పై కెనడా ఉగ్రముద్ర వేశారు. అయితే ఈ నిర్ణయంతో కెనడాలోని బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఆస్తులు, వాహనాలు, స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యక్రమాలకు నిధుల సేకరణ, వివిధ నేరాలకు సంబంధించిన కేసుల్లో బిష్ణోయ్ ముఠా సభ్యులను విచారణతో పాటు ముఠా సభ్యులపై ఆ దేశ పోలీసులు నిఘా ఉంచనున్నారు.

# ట్రిబ్యునల్స్ చట్టంపై సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు



**న్యూఢిల్లీ:** ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టం-2021లోని పలు కీలక నిబంధనలను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఇవన్నీ ట్రిబ్యునళ్లలో సభ్యుల నియామకాలు, పదవీకాలాలు, పదవీ నిబంధనలతో ముడిపడిన నిబంధనలు కావడం గమనార్హం. ఆయా రూల్స్‌లో స్వల్ప మార్పులతో కేంద్ర ప్రభుత్వం కొత్త రూల్స్‌ను తీసుకొచ్చినందున, పాత రూల్స్‌ను కొట్టివేశామని దేశ సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కె వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈమేరకు తీర్పు ఇచ్చింది. తాము కొట్టివేసిన 'ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టం-2021'లోని నిబంధనలు అధికారాల విభజన సూత్రాలకు, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు విఘాతం కలిగించేలా ఉన్నాయని బెంచ్ వ్యాఖ్యానించింది. అలాంటి రూల్స్‌ను ట్రిబ్యునల్స్ చట్టంలో తిరిగి చేర్చకూడదని పేర్కొంది. ట్రిబ్యునల్స్‌లోని పెండింగ్ కేసులపై కీలక వ్యాఖ్య"వివిధ ట్రిబ్యునల్స్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం బాధ్యత కేవలం న్యాయవ్యవస్థదే కాదు. ఈ బాధ్యతను ప్రభుత్వంలోని ఇతర విభాగాలు కూడా పంచుకోవాల్సిన అవసరం ఉంది. ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టంలోని పలు నిబంధనలను గతంలో పలు తీర్పుల సందర్భంగా సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో శాసనబద్ధ మార్గంలో ఆయా నిబంధనల్లో పార్లమెంటు మార్పులు,చేర్పులు చేసింది. సుప్రీంకోర్టు కొట్టివేసిన పాత నిబంధనల్లో మార్పులు చేసి, కొత్త నిబంధనలను కేంద్ర సర్కారు అమల్లోకి తీసుకొచ్చింది. ఆ రెండి ంటిని పోల్చి చూశాకే, ట్రిబ్యునల్స్ సంస్కరణల చట్టం-2021లో ఉన్న ఆచరణ యోగ్యం కాని, రాజ్యాంగబద్ధంకాని పాత నిబం ధనలను ఇప్పుడు కొట్టివేశాం" అని సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వెల్లడించారు. ఆ ట్రిబ్యునళ్లలో పదవీ కాలాలపై కొత్త ఆదేశాలుఆదాయపు పన్ను అప్పీళ్ల ట్రిబ్యునల్ (ఐటీఏటీ), కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పీళ్ల ట్రిబ్యునల్ (సీఈఎస్‌టీఏటీ)లలో ఉన్న సభ్యులు 62 ఏళ్ల వరకు కొనసాగొచ్చని గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది. అయితే ఆయా ట్రిబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు లేదా అధ్యక్షులు 65 ఏళ్లు నిండే వరకు పదవుల్లో కంటిన్యూ కావచ్చని తెలిపింది.

# ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు చర్యలు వేగవంతం చేస్తాం




**ఢిల్లీ, నవంబరు18:** ఢిల్లీలో నెలకొన్న కాలుష్యం పై ఆ రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా స్పందించారు. ఢిల్లీ కాలుష్యంపై తమ ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రోడ్లపై పేరుకుపోయే దుమ్ము, వాహనాల కాలుష్యాన్ని పరిష్కరించడానికి త్వరితగతిన చర్యలు చేపట్టామని వివరించారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో హాట్‌స్పాట్‌లను గుర్తించామని చెప్పుకొచ్చారు. బుధవారం ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా. ఢిల్లీలో దాదాపు 62 హాట్‌స్పాట్‌లను గుర్తించామని పేర్కొన్నారు. వాటిని ఆపగలిగితే, కాలుష్యం మరింత తగ్గుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. అందరం కలిసి కాలుష్యంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇది ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యంపై చేస్తున్న యుద్ధమని చెప్పుకొచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి.. ఈ యుద్ధంలో పోరాడటానికి ప్రజలు తమతో కలిసి రావాలని కోరారు. కాలుష్య కారకాలపై తమ ప్రభుత్వం అన్వేషణ చేస్తోందని మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా పేర్కొన్నారు.

# ఈడీ కస్టడీకి అల్-ఫలాహ్ యూనివర్సిటీ ఛైర్మన్




**ఢిల్లీ:** ఎర్రకోట పేలుళ్లల్లో కీలకంగా నిలిచిన ఫరీదాబాద్ అల్-ఫలాహ్ యూనివర్సిటీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆ సంస్థ ఛైర్మన్ జావద్ అహ్మద్ సిద్ధిఖీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సిద్ధిఖీని ఈడీ అరెస్ట్ చేసింది. మంగళవారం అరెస్ట్ చేసిన సిద్ధిఖీని ఈ రోజు సాకేత్ కోర్టులో ఈడీ హాజరు పరిచింది .మనీ లాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం 13 రోజుల పాటు సిద్ధిఖీని ఈడీ కస్టడీకి అప్పగించడానికి కోర్టు అనుమతించింది. ఫీజుల రూపంలో వసూలు చేసిన రూ. 415 కోట్లు మొత్తాన్ని నకిలీ అకౌంట్ల ద్వారా హవాలా మార్గంలో సిద్ధిఖీ మళ్లించినట్లు ఈడీ గుర్తించింది. సిద్ధిఖీ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. నిధుల మళ్లింపు, మనీలాండరింగ్?కు పాల్పడినట్లు నిర్ధారించుకుంది. అలాగే అక్రిడిటేషన్ లేకున్నా ఉన్నట్లుగా విద్యార్థులను తప్పుదారి పట్టించినట్లు గుర్తించిన ఈడీ ఈ విషయంపై కూడా విచారించనుందఢిల్లీ పేలుళ్ళకు సంబంధించి ఇప్పటి వరకు అరెస్ట్ అయిన ఉగ్రవాదులు అందరూ అల్ ఫలాహ్ యూనివర్శిటీకి చెందినవారే ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ళల్లో ఇప్పటి వరకు 15 మంది మృతి చెందారు. ఇంకా కొంత మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. యావత్ దేశాన్ని కుదిపేసిన ఈ ఘటనను ఉగ్రదాడిగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏకి అప్పగించింది.

# డిప్యూటీ సీఎంలుగా సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్



**పాట్నా:** నితీశ్ కుమార్ మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రులుగా ఉన్న బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా తిరిగి కొత్త ప్రభుత్వంలో అదే పదవుల్లో కొనసాగనున్నారు. పాట్నాలో బుధవారం ఉదయం జరిగిన బీజేపీ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారంనాడు జరిగే ఎన్డీయే ప్రభుత్వ ప్రమాణస్వీకారంలో సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా తిరిగి డిప్యూటీ సీఎంలుగా ప్రమాణం స్వీకారం చేస్తారు. జేడీయూ ఎల్పీ నేతగా నితీశ్మరోవైపు, జేడీయూ లెజిస్లేచర్ పార్టీ నేతగా నితీశ్ కుమార్ ఎన్నికయ్యారు. పాట్నాలో బుధవారం జరిగిన జేడీయూ ఎమ్మెల్యేల సమావేశంలో నితీశ్‌ను ఏకగ్రీవంగా తమ నేతగా ఎన్నుకున్నారు. దీంతో ఎన్డీయే నేతగా నితీశ్ ఎన్నికకు మార్గం సుగమమైంది. ఈనెల 20న ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు జరుగుతుండగా, గవర్నర్ ఆరిఫ్ అహ్మద్ ఖాన్‌ను నీతీశ్ కలుసుకుని కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరనున్నారు. ఎన్డీయే మద్దతు లేఖలను కూడా అందజేస్తారు. ముహూర్తం ఖరారుమరోవైపు, నితీశ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాట్నాలోని గాంధీ మైదానంలో 20వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు.

# హిందూ మహిళలు విల్లు రాయాలి



**న్యూ ఢిల్లీ :** దేశంలో హిందూ మహిళల ఆస్తులపై గత కొన్నేళ్లుగా వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. హిందూ మహిళ ఆస్తి కోసం పుట్టింటివారు, అత్తింటి వారు కోర్టు మెట్లు ఎక్కుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలు తమ మరణానంతరం ఆస్తిపై వివాదం లేకుండా ఉండాలంటే.. వారు బతికి ఉండగానే ఆస్తి ఎవరికి చెందాలనే విషయంలో స్పష్టంగా వీలునామా రాయాలని సూచించింది. మహిళకు పిల్లలు లేకపోతే ప్రస్తుత హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆమె ఆస్తి మొదటగా భర్త కుటుంబానికి వెళ్లే అవకాశం ఉంటుందని కోర్టు గుర్తుచేసింది. కానీ చాలా సందర్భాల్లో ఆస్తి విషయమై మహిళ పుట్టింటి వాళ్లకు, అత్తింటి వారికి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయని పేర్కొంది. వివాహానంతరం మహిళ గోత్రం మారుతుందన్న సంప్రదాయ అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావిస్తూ.. వివాహం తర్వాత మహిళపై ప్రధాన బాధ్యత భర్త కుటుంబానిదే అవుతుందని పేర్కొంది.

# రెండో టెస్టులో గిల్ ఆడతాడా?



భారత్, సౌత్ ఆఫ్రికా మధ్య రెండవ టెస్ట్ నవంబర్ 22న గౌహతిలో ప్రారంభం కానుంది. అంతకుముందు టీమిండియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ టెస్టులో టీమ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడటం దాదాపుగా కష్టమని తెలుస్తోంది. కోల్‌కతా టెస్టు సందర్భంగా అతనికి నెక్ స్ప్యాజమ్ వచ్చింది. దీని వల్ల గిల్ ఆసుపత్రిలో కూడా చేరాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ మధ్యలోనే రిటైర్డ్ హర్ట్ గా వెళ్లిపోయిన గిల్ రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్‌కు దిగలేదు. ఇప్పుడు గిల్ నవంబర్ 18న ఈడెన్ గార్డెన్స్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు. కెప్టెన్ కోలుకోవడానికి ఇంకా 5 నుండి 7 రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. గిల్ కోలుకుంటున్నాడని తెలిపిన బోర్డు.. రెండో టెస్టులో ఆడటంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత సమాచారం ప్రకారం, శుభ్‌మన్ గిల్ జట్టుతో గౌహతికి వెళ్తాడు అని బీసీసీఐ తెలిపింది. కానీ జట్టుతో పాటు గౌహతికి వెళ్లినా కూడా రెండో టెస్టులో గిల్ ఆడకపోవచ్చు. తనకు ఇప్పుడు విశ్రాంతి అవసరం. రెండో టెస్టులో గిల్ ఆడటంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని బోర్డు పేర్కొంది. గిల్ ఆడకపోతే, రిషబ్ పంత్ రెండో టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది. టీమ్ మేనేజ్‌మెంట్ పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటుంది. అయితే భారత్ ప్లేయింగ్ %శ×%లో పెద్ద మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉందని సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి. యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని అధికారికంగా టెస్ట్ జట్టులోకి చేర్చుకుంది. ఈడెన్ గార్డెన్స్ టెస్టుకు ముందు నితీష్ ను రిలీజ్ చేసింది. తద్వారా అతను ఇండియా %ూ% జట్టులో భాగం అయ్యాడు. గౌహతి టెస్టులో గిల్ అందుబాటులో ఉండటం అనుమానంగా మారడంతో సెలెక్టర్లు వెంటనే నితిష్ రెడ్డిని తిరిగి పిలిపించారు.నవంబర్ 18న జట్టు ప్రత్యామ్నాయ శిక్షణా శిబిరంలో నితిష్ రెడ్డి పాల్గొన్నాడు. అతడు జట్టులో చేరడంతో భారత్ ప్లేయింగ్ ఎలెవన్ లో మార్పులు చేయడం ఖాయం. గిల్ ఆడకపోతే నితీష్ రెడ్డికి నేరుగా ప్లేయింగ్ %శ×%లో అవకాశం లభిస్తుంది. సీనియర్లు సైతం ఇదే అభిప్రాయంతో ఉన్నారు.నితీష్ రెడ్డి తన టెస్ట్ కెరీర్‌లో 9 మ్యాచ్‌లు ఆడి 386 పరుగులు చేశాడు. ఇందులో ఒక అద్భుతమైన సెంచరీ ఉంది. అది కూడా ఆస్ట్రేలియాపై చేయడం విశేషం. బౌలింగ్‌లో 8 వికెట్లు తీశాడు. 2024లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత ఈ తెలుగు తేజం నిరంతరం భారత క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఫోకస్‌లో ఉన్నాడు. గిల్ అందుబాటులో లేకపోతే కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. లేనిపక్షంలో రాహుల్ కు తాత్కాలిక కెప్టెన్సీ బాధ్యత అప్పగించే అవకాశం లేకపోలేదు.

# కామెరాన్ గ్రీన్ పై కన్నేసిన సన్ రైజర్స్ హైదరాబాద్



సన్ రైజర్స్ హైదరాబాద్.. మినీ వేలంలో పోటీకి సిద్ధమైంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కోరుతున్న ఆ ప్లేయర్ కోసం గట్టిగా పోటీ పడనుంది. ఐపీఎల్ ఫ్రాంచైజీలన్నీ కూడా తమ కోర్ టీంపై నమ్మకాన్ని ఉంచాయి. ముఖ్యంగా బెంచ్‌కే పరిమితమైన ప్లేయర్స్, నిలకడలేమి ఆటగాళ్లకు గుడ్ బై చెప్పేయడానికి సిద్ధమయ్యాయి. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్‌ను ముంబై టీంకు ట్రేడ్ చేసి.. రోహిత్ శర్మను తీసుకుంటుందని.. అలాగే హెన్రిచ్ క్లాసెన్‌ను వేలంలోకి వదిలేసి.. మళ్లీ కొనుగోలు చేస్తుందని టాక్ వినిపించింది. అయితే వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ కావ్యపాప.. తన కోర్ టీంపై మళ్లీ భరోసాతో ముందుకు వెళ్తోంది. కావ్యా పాప కోర్ టీం విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ కచ్చితంగా మరోసారి ఓపెనింగ్ బ్యాటర్లుగా బరిలోకి దిగనున్నారు. అలాగే మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ ఉండకనే ఉన్నారు. ఆ తర్వాత నితీష్ కుమార్ రెడ్డి, అనికేట్ దిగనుండగా.. వీరికంటే ముందు మరో ఆల్‌రౌండర్-కమ్ ఫినిషర్ రోల్ కోసం ఓ ప్లేయర్‌ను వేలంలో కొనుగోలు చేయడానికి హైదరాబాద్ యాజమాన్యం ఆసక్తిగా చూస్తోంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా అతడి కోసం కోట్లు అయినా ఖర్చు చేయాలని చెప్పాడట. అతడెవరో కాదు.. కామెరాన్ గ్రీన్. గాయం నుంచి కోలుకున్న ఈ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్.. అటు వన్డేలు, ఇటు టీ20ల్లో దుమ్మురేపుతున్నాడు. అలాగే మరికొన్ని రోజుల్లో యాషెస్ టెస్ట్ సిరీస్ ప్రారంభం అవుతుండటంతో.. అందరి ఫోకస్ అతడిపైనే పడింది. ఇక్కడ కామెరాన్ గ్రీన్ కోసం హైదరాబాద్‌కు మినీ వేలంలో గట్టి పోటీ ఎదురయ్యేలా కనిపిస్తోంది. అటు కేకేఆర్, చెన్నై కూడా ఈ ఆల్‌రౌండర్ కోసం పోటీ పడుతున్నాయి. మరి ఎవరికి దక్కుతాడో చూడాలి.

# నంబర్ 1 స్థానం కోల్పోయిన రోహిత్ శర్మ

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మకి అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో స్వల్ప షాక్ తగిలింది. కేవలం మూడు వారాల పాటు నంబర్-1 స్థానంలో కొనసాగిన రోహిత్ శర్మ, ఆ కిరీటాన్ని ఇప్పుడు కోల్పోయాడు. ఆస్ట్రేలియా పర్యటనలో హాఫ్ సెంచరీ, సెంచరీ ఇన్నింగ్స్‌ల ద్వారా నంబర్-1 స్థానానికి చేరుకున్న రోహిత్, తాజా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయాడు. అయితే రోహిత్ శర్మను వెనక్కి నెట్టిన ఆ న్యూజిలాండ్ బ్యాటర్, అతడి కంటే కేవలం ఒక్క పాయింట్ మాత్రమే ముందుండటం విశేషం. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన మొదటి వన్డేలో మిచెల్ సెంచరీ (119 పరుగులు, 118 బంతులు) చేయడంతో, ఈ ప్రదర్శన అతడికి ర్యాంకింగ్‌లో బాగా కలిసొచ్చింది. అంతకుముందు మూడో స్థానంలో ఉన్న మిచెల్, ప్రస్తుతం 782 రేటింగ్ పాయింట్స్ తో నంబర్-1 స్థానాన్ని దక్కించుకున్నాడు. రోహిత్ శర్మ ఇప్పుడు 781 రేటింగ్ పాయింట్స్ తో రెండో స్థానానికి పడిపోయాడు. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్ మూడో స్థానంలో ఉన్నాడు. డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకోవడం న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన రికార్డు. ఎందుకంటే సుమారు



47 సంవత్సరాల తర్వాత న్యూజిలాండ్‌కు చెందిన ఒక బ్యాటర్ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఇంతకుముందు 1979 సంవత్సరంలో గ్లెన్ టర్నర్ నంబర్-1 వన్డే బ్యాటర్‌గా నిలిచాడు. డారిల్ మిచెల్ ఈ ఏడాది (2025) అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఈ సంవత్సరం 16 ఇన్నింగ్స్‌లలో 54.35 సగటుతో 761 రన్స్ చేశాడు. రోహిత్ శర్మ వన్డే ర్యాంకింగ్‌లో కేవలం ఒక్క పాయింట్ తేడాతో వెనుకబడటం వలన నంబర్-1 స్థానాన్ని తిరిగి దక్కించుకోవడానికి అతనికి వెంటనే ఒక చక్కటి అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి భారత్, సౌతాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లలోనూ రోహిత్ శర్మ మంచి ప్రదర్శన చేస్తే, డారిల్ మిచెల్‌ను దాటి మళ్లీ అగ్రస్థానాన్ని సొంతం చేసుకోవడం ఖాయం. రోహిత్ శర్మ ప్రస్తుతం టీ20, టెస్ట్ ఫార్మాట్‌ల నుంచి రిటైర్మెంట్ తీసుకుని కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో డారిల్ మిచెల్ (782), రోహిత్ శర్మ (781) మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. ఆ తర్వాత, ఇబ్రహీం జద్రాన్ (764), శుభమాన్ గిల్ (745), విరాట్ కోహ్లీ (725) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. భారత బ్యాటర్లలో శ్రేయస్ అయ్యర్ రెండు స్థానాలు మెరుగు పరుచుకుని ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. శ్రీలంక ఆటగాడు చరిత్ అసలంక 3 స్థానాలు దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోవడం వలన బాబర్ ఆజం (ఆరో స్థానం), హ్యారీ టెక్టర్ (ఏడో స్థానం) లకు కూడా ర్యాంకుల్లో ప్రయోజనం కలిగింది.

# భారత్‌కు ఘోర పరాజయం..!

- 2-1తో భారత్-ఏ జట్టు సిరీస్ కైవసం





సౌతాఫ్రికా-ఏతో అనధికార మూడు వన్డేల సిరీస్‌లో భారత్-ఏకు ఘోర పరాజయం ఎదురైంది. రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని భారత్-ఏ జట్టు 72 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఈ సిరీస్‌ను భారత్-ఏ జట్టు 2-1తో కైవసం చేసుకుంది. ఆఖరి అనధికార వన్డేలో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా-ఏ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 325 పరుగుల భారీ స్కోర్ చేసింది. లుహాన్ డ్రీ ప్రిటోరియస్(98 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లతో 123), రివల్డో మూన్‌సమీ(130 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 107) సెంచరీలతో రాణించారు. భారత్-ఏ బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా రెండేసి వికెట్లు తీసారు.అనంతరం భారత్ 49.1 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని(66 బంతుల్లో 8 ఫోర్లతో 66), ఇషాన్ కిషన్(67 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించగా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ తిలక్ వర్మ(11), అభిషేక్ శర్మ(11), రుతురాజ్ గైక్వాడ్(25) దారుణంగా విఫలమయ్యారు. సౌతాఫ్రికా బౌలర్లలో పీటర్(4/48) నాలుగు వికెట్లు తీయగా.. మోరెకి(2/56) రెండు వికెట్లు పడగొట్టాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌కు సన్నాహకంగా ఈ మూడు అనధికార వన్డేలను నిర్వహించారు. ఈ టోర్నీలో రాణించిన ఆటగాళ్లకు భారత వన్డే జట్టులో చోటు దక్కే ఛాన్స్ ఉంది. ఈ సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ 117, 68 పరుగులతో రాణించాడు. అతనికి సౌతాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో అవకాశం దక్కవచ్చు. ఈ మూడు వన్డేల్లో తిలక్ వర్మ, అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చారు.

# రింకూ సింగ్ భారీ శతకం..



ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో టీమిండియా హిట్టింగ్ సెన్సేషన్ రింకూ సింగ్ దుమ్మురేపుతున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ తనదైన బ్యాటింగ్‌తో శతకాల మోత మోగిస్తున్నాడు. ఈ దేశవాళీ టోర్నీలో ఉత్తరప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రింకూ సింగ్.. తమిళనాడుతో బుధవారం డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో భారీ శతకంతో చెలరేగాడు.247 బంతులాడిన రింకూ సింగ్ 17 ఫోర్లు, 6 సిక్స్‌లతో 176 పరుగుల భారీ స్కోర్ చేశాడు. తృటిలో డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. దాంతో ఈ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 145.1 ఓవర్లలో 460 పరుగుల భారీ స్కోర్ చేసింది. 5 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తమిళనాడు ఆఖరి రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 103 పరుగులు చేసింది.ఫలితం తేలే పరిస్థితి లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. దాంతో నిర్ణీత సమయం కంటే ముందే ఈ మ్యాచ్ ముగిసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన తమిళనాడు 455 పరుగుల భారీ స్కోర్ చేసింది. బాబా ఇంద్రజిత్(149), ఆండ్రూ సిద్దార్థ్(121) సెంచరీలతో రాణించారు. రింకూ సింగ్ భారీ శతకంతోనే ఈ మ్యాచ్‌లో యూపీ ఓటమిని తప్పించుకుంది. ఆంధ్రతో జరిగిన తొలి రంజీ మ్యాచ్‌లోనూ రింకూ సింగ్ 165 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్ కూడా ఫలితం తేలకుండా డ్రాగానే ముగిసింది. రింకూ సింగ్‌కు ఇది 9వ ఫస్ట్ క్లాస్ సెంచరీ. వరుసగా రెండో 150ం స్కోర్. 52 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 59.07 యావరేజ్‌తో రాణించిన రింకూ సింగ్‌పై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. తమిళనాడు, ఆంధ్ర స్పిన్నర్లను రింకూ సమర్థవంతంగా ఎదుర్కోవడంతో సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌కు రింకూ సింగ్‌ను తీసుకోవాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. కోల్‌కతా వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో స్పిన్ బౌలింగ్ ఆడలేక టీమిండియా 30 పరుగుల తేడాతో ఓడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రెండో టెస్ట్‌కు రింకూ సింగ్‌ను తీసుకోని తుది జట్టులో అవకాశం ఇవ్వాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు.

# అండర్ 14, 16 క్రీడా టోర్నీలను రద్దు చేయండి

- ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు



దేశ రాజధాని న్యూఢిల్లీలో అండర్ 14, 16 క్రీడా టోర్నీలను రద్దు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం ఢిల్లీలో నెలకొన్న వాయు కాలుష్యంపై చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.అండర్ 16, అండర్ 14 ఇంటర్ జోనల్ క్రీడా టోర్నీలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ఢిల్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయవాది అపరాజితా సింగ్ వేసిన పిటిషన్‌ను బీఆర్ గవాయ్-కే వినోద్ చంద్రన్ ధర్మాసనం బుధవారం విచారించింది.ఈ కాలుష్యం మధ్య క్రీడా టోర్నీలు నిర్వహిస్తే.. పిల్లలను గ్యాస్ చాంబర్స్‌లో పెట్టినట్లవుతుందని, వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. కాలుష్యం తగ్గేవరకు పాఠశాలల్లో క్రీడా టోర్నీలు నిర్వహించవద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఈ టోర్నీలు నిర్వహించాలని సూచించింది. అవసరమైతే కాలుష్యం తగ్గే వరకు టోర్నీలను వాయిదా వేయాలని పేర్కొంది.

## 24ఏళ్లు పూర్తి చేసుకున్న అమృతం సీరియల్



తెలుగు టీవీ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిన కామెడీ సిట్‌కామ్ 'అమృతం' ప్రసారమై 24 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు ఈ సీరియల్ జ్ఞాపకాలను పంచుకుంటూ పోస్టులతో సందడి చేస్తున్నారు. 2001 నవంబర్ 18న జెమిని టీవీలో ప్రారంభమైన ఈ సిట్‌కామ్ 2007 నవంబర్ 18 వరకు విజయవంతంగా ప్రసారమైంది. ఆరు సంవత్సరాలలో దాదాపు 313 ఎపిసోడ్‌లతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. 'అమృతం' కేవలం కామెడీ సీరియల్ మాత్రమే కాదు మధ్య తరగతి జీవితంలోని సమస్యలు, ఆశలు, నిరాశలను హాస్యం రూపంలో అద్దం పట్టించింది. ప్రముఖ నిర్మాత, రచయిత గుణ్ణం గంగరాజు ఈ హాస్య ధారావాహికను సృష్టించి, నిర్మించగా.. అమృతం పాత్రలో శివాజీ రాజా, నరేష్, హర్షవర్ధన్ కాలానికి అనుగుణంగా నటించారు. అంజి పాత్రలో గుండు హనుమంతురావు నటించగా.. సర్వం పాత్రలో వాసు ఇంటూరి, అప్పాజీ పాత్రలో శివన్నారాయణ నరిపెద్ది నటించి మెప్పించారు.



### నిన్న అదితి..నేడు శ్రియా

## నకిలీ వాట్సప్ క్రియేట్ చేసిన దుండగులు

నటి అదితిరావు హైదరి పేరుతో ఇటీవల నకిలీ వాట్సప్ క్రియేట్ చేసి ఒక వ్యక్తి ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో నటి శ్రియ శరణ్ ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటివారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులను నేను కలిసి వర్క్ చేయనున్న వారికి మెసేజ్‌లు చేస్తున్నాడు. అందరూ అప్రమత్తంగా ఉండండి అంటూ శ్రియ తెలిపారు. తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి ఇటీవల విజ్ఞప్తి చేశారు. 'నా పేరుతో పాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఫొటోషూట్ లాంటి వాటికోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలియజేయండి' అని పేర్కొన్నారు.



# భయపెట్టనున్న అల్లరి నరేశ్..

### హారర్ థ్రిల్లర్‌కు సెన్సార్ క్లియర్

విలక్షణ నటుడు అల్లరి నరేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హారర్ థ్రిల్లర్ '12%గా% రైల్వే కాలనీ' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని %ఖ/గా% సర్టిఫికెట్‌ను పొందింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ అధికారికంగా ప్రకటించింది. అనేక మలుపులతో కూడిన ఈ థ్రిల్లర్‌ను ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండాలని ప్రేక్షకులకు సూచించింది. ఈ సినిమాకు 'పొలిమేర', 'పొలిమేర 2' చిత్రాలతో ప్రసిద్ధి చెందిన డా. అనిల్ విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించడంతో పాటు షోరన్నర్‌గా కూడా వ్యవహరించారు. నాని కాసరడ్డ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకత్వంతో పాటు ఎడిటింగ్ బాధ్యతలను కూడా ఆయనే నిర్వర్తిస్తున్నారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఇందులో అల్లరి నరేశ్ ఎంతో సీరియస్ పాత్రలో కనిపించారు. టీజర్‌లో దెయ్యాలు కొందరికే ఎందుకు కనిపిస్తాయంటూ వినపడే వాయిస్ ఓవర్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు సినిమా నేపథ్యాన్ని తెలియజేశాయి. చివర్లో అల్లరి నరేశ్ ఒకరిని కాల్చి చిరునవ్వుతో కనిపించడం ప్రేక్షకులలో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో 'పొలిమేర' ఫేమ్ డా. కామాక్షి భాస్కర్ల కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ సినిమా, నవంబర్ 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.




## వారణాసి నుంచి రణకుంభ పాట విడుదల




దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన 'రణ కుంభ' పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 'ప్రళయం ప్రళయం' అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. 'వారణాసి' సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

## మరో వివాదంలో ధనుష్


### టీవీ నటి మాన్యా ఆనంద్ సంచలన వ్యాఖ్యలు





నిత్యం ఏదో ఓ వార్తలో ప్రధానంగా నిలిచే తమిళ స్టార్ హీరో ధనుష్ పై మరో కొత్త వివాదం రేగింది. ఈసారి ప్రముఖ టీవీ నటి మాన్యా ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన విషయాలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో పెద్ద కలకలం రేపుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ధనుష్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో ముఖ్యమైన పాత్ర ఇస్తామని చెప్పి ఆయన మేనేజర్ శ్రేయాస్ తనను సంప్రదించాడని, నేను కూడా 'ఒక మంచి అవకాశం వస్తుందని నిజంగా నమ్మాను. కానీ రోజులు గడిచేకొద్దీ వాళ్లు అడిగిన మాటలు, ప్రవర్తన చూసి నేను షాక్ అయ్యానని పేర్కొంది. 'పాత్ర కోసం కొన్ని కమిట్‌మెంట్‌లు ఇవ్వాలి' అని సూచిస్తూ, ధనుష్‌తో 'అడ్జస్ట్మెంట్' చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆరోపించింది. వారి అసలు ఉద్దేశం త్వరగానే తెలుసుకుని నేను జాగ్రత్త పడ్డానని కానీ పాత్ర కోసం మహిళలపై ఇలాంటి ఒత్తిడి తేవడం చాలా తప్పని మాన్యా ఇంటర్వ్యూలో తెలిపింది. ఆ విషయం నన్ను తీవ్రంగా కలచివేసిందని వివరించింది. ఇంకా మాన్యా మాట్లాడుతూ..ఇలాంటి ఒత్తిళ్లు, 'అడ్జస్ట్మెంట్' పేరుతో జరిగే అనైతిక డిమాండ్లు చిత్రపరిశ్రమలో ఇంకా కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చే నటీమణులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు భయంతో బయట పెట్టలేరని, ఈ విషయాలు బహిరంగంగా చెప్పడానికి చాలా ధైర్యం కావాలని, తనలాంటి వారు మాట్లాడితేనే మార్పు వస్తుందని ఆమె అన్నారు. అయితే.. అమె ఈ ఘటన ఎప్పుడు జరిగింది, ఏ సినిమా విషయంలో చోటు చేసుకున్నది, ఇప్పుడే ఎందుకు బయట పెట్టిందనే విషయాలు మాత్రం చెప్పలేదు. అయితే అయితే ధనుష్, లేదా ఆయన టీమ్, మేనేజర్ శ్రేయాస్ ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే.. వైరల్‌గా మారిన ఈ వివాదంపై అరోపణలు చేసిన నటి మాన్యా ఆనంద్ స్పందించి ఇన్స్టాలో ఓ న్యూస్ షేర్

## ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ విడుదల



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా